ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
16 అక్టోబర్, 2011



Entered



ప్రాచీన దేశంలో పోరాట జ్వాలలు

హ్యాపీబర్త్‌డే

(2011 అక్టోబర్ 16నుంచి
2011 అక్టోబర్ 22 వరకు)

ఎన్. ప్రమోద్
7సం॥, అక్టోబర్-2004
నాగమణి-జగన్నాథరావు
బిహెచ్‌పివికాలనీ-విశాఖ

ఎన్. ఝస్వీత దుర్గ
1సం॥, అక్టోబర్-2010
బాలరాజరాజేశ్వరి-జయరాములు
శాబ్దుల్లాపురం-నల్లగొండ

జివి. తేజ సుమణి
2సం॥, అక్టోబర్-20
కవిత-నారాయణ
గిద్దలూరు-ప్రకాశం

కె. మారియం
8సం॥, అక్టోబర్-2003
షాన్‌వాజ్-అబ్దుల్‌కలాం
నెల్లూరు

ధీరజ్
1సం॥, అక్టోబర్-20
గుణవతి-రామిరెడ్డి
రేణిగుంట-చిత్తూరు

పి. ధీరజ్
8సం॥, అక్టోబర్-2003
దర్పణ-రాజేష్‌కుమార్
షీలానగర్-విశాఖ

మహాలక్ష్మి(మహి)
3సం॥,అక్టోబర్-2008
రజని-నవీన్
విశాఖపట్నం

టి. జ్యోత్స్న
1సం॥, అక్టోబర్-20
శైలజ-కిషోర్‌బాబు
కొండపట్టూరు-గుంటూరు

జి. పృధ్వీ గణేష్
3సం॥,అక్టోబర్-2008
అర్పిత-ఉపేంద్ర
బిహెచ్ఇఎల్-హైదరాబాద్



బి. ప్రణీత(మాజి)
1సం॥, అక్టోబర్-2010
పుష్ప-శ్రీనివాస్‌రెడ్డి
మాచర్ల-గుంటూరు

సాత్విక్
2సం॥, అక్టోబర్-2009
సరిత-నరేష్
హాలియా-నల్లగొండ

పి. సూరజ్
అక్టోబర్
దర్పణ-రాజేష్‌కుమార్
షీలానగర్-విశాఖ

పి. హర్షిత
అక్టోబర్-19
వరలక్ష్మి-నాగభూషణం
ధవళేశ్వరం-తూ॥గో

పి. శివ
అక్టోబర్
ముత్యాలమ్మ-చంద్రయ్య
గుంటూరు

వి. ప్రజ్ఞ
1సం॥, అక్టోబర్-18
దివ్య-గంగరాజు
రైల్వేకాలనీ-తిరుపతి

విద్యాశ్రీ
అక్టోబర్
లక్ష్మి-శివరాములు
కొత్తకోట-మ॥నగర్

భాను ప్రకాష్
అక్టోబర్
లక్ష్మి-శివరాములు
కొత్తకోట-మ॥నగర్

మనలో మాట

లో'కలే'

పుస్తకాల పురుగు...ఇది వెనుకటి మాట. ఇప్పుడు నెట్ పురుగులూ మొబైల్ పురుగులూ వచ్చేశాయి. మొబైల్ పురుగుల్లో ఒకడు కిట్టూ. వాడికి సెల్ సంగతులన్నీ కొట్టిన పిండి. ఈ ప్రపంచంలో వాడికి నచ్చిన మాట మొబైల్. మెచ్చిన వస్తువు సెల్‌ఫోన్. ఇష్టమైన యాడ్ 'మాట్లాడు ఇండియా మాట్లాడు'. మెచ్చిన మాట 'ఒకే దేశం ఒకే చార్జి'. మర్చిపోలేని రోజు 10.10.11. కారణం.. గూబ గుయ్ మనిపించే రోమింగ్ చార్జీల నుంచి విముక్తి కలిగించిన రోజు కాబట్టి. డిసెంబర్ మాసం కోసం ఆత్రంగా ఎదురుచూస్తున్నాడు. కారణం... లోకల్ సూత్ర అమలౌతుంది కాబట్టి. లోకల్ సూత్ర అమల్లోకొచ్చాక ఎవరెవరితో ఏమేం మాట్లాడాలో ఆలోచిస్తూ నిద్రలోకి జారుకున్నాడు.

◆◆◆

"హలో...నాన్నా కిట్టూ! ఎలా వున్నావ్‌రా? రాష్ట్రం కాని రాష్ట్రంలో చదువులు. వద్దంటే పట్టుబట్టి అక్కడ చేరావ్. తిండి సరిగ్గా తింటున్నావా! గొంతేంటి కన్నా తేడాగా వుంది. జలుబు చేసిందా... వేడి వేడి పాలల్లో మిరియాల పొడి వేసుకొని తాగు. గుణం కనిపిస్తుంది. మళ్లీ సాయంత్రం ఫోన్ చేస్తా. ఎలా వుందో చెప్ప నాన్నా. ఆరోగ్యం జాగ్రత్త..."

◆◆◆

"ఒరే కిట్టిగా! వచ్చే శుక్రవారం మన సూరిగాడి పెళ్లి. పిల్ల ఎవరో కాదు. ఆడి మేనత్త కూతురు సుబ్బలక్ష్మే. కథ చాలా జరిగిందిలే. ఇప్పుడే అదంతా చెప్పేద్దునుగానీ అందర్నీ పిలవాలి. కార్డు ఖర్చులెందుకని పిలుపులన్నీ ఫోన్లోనే కానిస్తున్నాం. నువ్వుగాని రాకపోయావో ఊరుకొనేది లేదురోయ్. అన్నట్టు మన గ్యాంగ్ తరపున మంచి ఫోన్ కొనుక్కురా. గిప్టుగా కొత్త జంటకు చదివిద్దాం. వుంటాన్రరే...ఫోన్ మర్చిపోకు'

◆◆◆

"ఒరే కృష్ణా. ఎంతైనా నువ్వు సార్థకనామధేయుడివిరా! పొరుగు రాష్ట్రంలో చదువుకునేవాడికి మన లోకల్ అమ్మాయిలను గోకడం అవసరమంట్రా! ఫోన్లో పిచ్చి పిచ్చి ఎస్సెమ్మెస్సులు చేస్తున్నావంట. తెగ విసిగిస్తున్నావంట. నీ చరిత్ర నాకెలా తెలిసిందా అని ఆశ్చర్యపోతున్నావా? నేను లోకల్ ఎస్సైని. నీలాంటి పోకిరీల జాతకాలన్నీ నా జేబులో వుంటాయి. ఇదిగానీ రిపీటైందంటే... నీ తోలు వలిచేసి సెల్‌ఫోన్ కవర్ కుట్టించుకుంటా. ఒళ్లు దగ్గరపెట్టుకొని మసలుకో... "

◆◆◆

"రేయ్ డబ్బు కావాల్సినప్పుడేమో కాళ్లా వేళ్లా పడతారు. తీరా అప్పిచ్చాక మొహం చాటేస్తారు. ఈ మధ్య ఫోన్‌కూడా తియ్యట్లేదేంట్రా! అప్పు తీర్చమంటాననా. అందుకేరా! కొత్త నెంబరునుంచి చేశా. అయినా పిల్ల పెళ్లికని తీసుకున్న లక్ష రూపాయలు ఎవడు తీరుస్తాడుబే... చచ్చి స్వర్గానున్న నీ బాబా! మూస్కొని వారం రోజుల్లో ఆ లక్షా కట్టేసెయ్. లేకపోతే ఈ వడ్డీల సుబ్బారావ్ ఏం చేస్తాడో వాడికే తెలియదు..ఆ...!"

◆◆◆

చివరి ఫోన్ కాల్‌తో ఉలిక్కిపడి లేచి కూర్చున్నాడు కిట్టు. ఒకే దేశం ఒకే చార్జి కింద తానెవరెవరితో మాట్లాడాలో ప్లాన్ చేస్తుంటే ఇదేమిటి అందరూ నాకే ఫోన్ చేశారు. కల అంటే ఇదే తిరకాసు మరి. అయినా దేశమంతా లోకలయ్యాక ఇన్‌కమింగ్ పడ్తుందని భయమెందుకు...నిర్భయంగా మళ్లీ నిద్రలోకి జారుకున్నాడు కిట్టూ.

★

ఈ సంచికలో....

టపా	...	2
రుచి	...	3
కవిత్వమ్	...	4
సినిమా కబుర్లు	...	8
ఎవరి గోల వారిదే	...	9
ఈ పేజ్	...	10
అట్టమీది కథ	...	14
కొత్తపుస్తకాలు	...	19
బాలనేస్తాలు	...	22
మాటల కోట	...	24

ఇంకా...

పాత కథ ... 6

బ బ్బ బ్బా

తెలుసుకుందామా ... 12

అభివృద్ధికి దిక్సూచి సోషలిస్ట్ వియత్నాం

ప్రత్యేకం ... 18

స్టీవ్‌జాబ్స్ @ పిక్సర్

వికాసం ... 20

ఆడ... మగ... తేడాలు



'మందే'మాతరమా?

అట్టమీది కథ 'బైక్ క్రేజ్' ఆలోచింపజేసింది. 'ఈ పేజ్, ఈ న్యూస్'లో ప్రతివారం కంప్యూటర్‌కి సంబంధించిన విషయాలు అందిస్తున్నారు. 'జంతు ప్రపంచం' లో చిత్రకారుడి ప్రతిభ కనిపిస్తోంది. 'వికాసం' ద్వారా నిద్ర ఆవశ్యకతను వివరించారు. కైరో పరిసర ప్రాంతాలను, పిరమిడ్ల వివరాలను కళ్లకు కట్టేలా 'చూద్దామా' అందించింది. 'బాల నేస్తాలు'లో నేర్చుకుందామా ఆసక్తికరంగా ఉంది. అడిగోపుల వెంకటరత్నం 'కవిత' బాగుంది. 'బడ్జెట్' కథను అందించిన శాంతసుందరికి అభినందనలు. ఎం.డి. హాసన్ షరీఫ్ 'మోడీ' బతుకును ఎండగట్టారు. 'సినిమా కబుర్లు' విభిన్న తరహాలో ఆకట్టుకుంటున్నాయి. 'మనలో మాట'లో చెప్పినట్లు ప్రభుత్వాన్ని బతికించేదీ మందే, ప్రజల్ని నిలువునా ముంచేదీ మందే. మనది వందేమాతరం కాదు... 'మందే'మాతరం అన్నట్లుంది.

నేమాన సుభాష్‌చంద్రబోస్, శ్రీకాకుళం.

హ్యాపీ హ్యాపీగా...

మంత్రులే మందుబాబులైతే మందుపై అదుపు ఎలా ఉంటుంది? 'వికాసం'లో చెప్పినట్లు మనసు ప్రశాంతంగా ఉంటే అందం దానంతట అదే వస్తుంది. 'బడ్జెట్' కథ బాగుంది. 'చూద్దామా'లో మమ్మీల గాథ అపూర్వం. బైకులంటే ఎంత మోజున్నా ప్రమాదాలు కొని తెచ్చుకోకూడదు. కొందరు నాయికల జీవితాలు తెర మీద ఎంతందంగా ఉన్నా, తెర వెనుక అంత ఘోరంగా ఉంటున్నాయి. 'జంతు ప్రపంచం' వింత లోకంలా ఉంది. అదో తమాషా ప్రపంచం. 'హ్యాపీ బర్త్‌డే' పేజీ చూస్తుంటే చాలా హ్యాపీగా ఉంది.

వాస్తు రామచంద్ర, నెల్లూరు.

వెన్నతో పెట్టిన విద్య

వికాసం అందించిన 'విశ్రాంతి అవసరం' బాగుంది. ఒత్తిడితో పాటు వాతావరణంలో వచ్చిన మార్పు కూడా మనిషిని నిద్రకు దూరం చేస్తుంది. గాయాలపై కారం చల్లిన మోడీకి మామూలు మొట్టికాయలు చాలవు. ఎన్ని తప్పులు చేసినా కప్పిపుచ్చుకోవడం అధికారంలో ఉన్న వాళ్లకి వెన్నతో పెట్టిన విద్య. అడిగే వాళ్లను అణగదొక్కుతారు. ఎదిరించే వాళ్లను అంతం చేస్తారు. పదవీ వ్యామోహం ఏ పనైనా చేయిస్తుంది. సామాన్య ప్రజలకు కనీస అవసరాలు తీర్చాలంటే మనసొప్పదు. అదే వాళ్ల హైటెక్‌దీక్షకు కోట్లైనా ఖర్చుపెడతారు. మోడీపై మల్లికా సారాబాయి చేస్తున్న పోరాటం విజయవంతం కావాలి. రాజే తలచుకుంటే కొరడా దెబ్బలకు లోటుండదని, టుటుంఖామెన్ రాజు తలచుకోగానే ఆయన వాడే వస్తువులన్నీ బంగారుమయమై పోయాయి. 'బైక్ క్రేజ్' వల్ల వచ్చిన కష్టాలు అన్నీ ఇన్నీ కాదు. పెద్దవాళ్లే కాదు, చిన్న పిల్లలూ ప్రాణాలమీదకి తెచ్చుకుంటున్నారు. బైకులు, ఫోన్లు పిల్లలకివ్వడం వల్ల లాభాల కంటే నష్టాలే ఎక్కువగా జరుగుతున్నాయి. 'జంతు ప్రపంచం' బాగుంది. చిత్రకారుని పేరు కూడా రాస్తే బాగుండేది. ఇటువంటి మరెన్నో విషయాలను పాఠకులకు అందించాలని కోరుకుంటున్నాం.

బొడ్డేపల్లి కనకలక్ష్మి, ఆముదాలవలస.

పరిష్కారం చూపిన కథ

తగినంత నిద్ర లేకపోతే ప్రాణాలమీదికి వస్తుందని 'వికాసం' ద్వారా వివరించారు. పేరు చదవగానే 'బడ్జెట్' కథ అంకెల చుట్టూ తిరుగుతుందనిపించింది. కానీ అభ్యుదయ భావాలు, కులం, అవినీతి గురించి కథను నడిపించారు. ముగింపు బాగుంది. కథ చదువుతుంటే హాయిగా ఉంది. హసన్ షరీఫ్ వ్యాసం బాగుంది.

మోడీ చేసిన కిరాతకాలను ప్రజలు ఎప్పటికీ మర్చిపోలేరు. ఆయన ఎన్ని సద్భావన సభలు జరిపినా చేసిన పాపం పోదు. 'బైక్ క్రేజ్' ని చూస్తుంటే భయం వేస్తుంది. యువతకు వెర్రి ఆనందమైతే, తల్లిదండ్రులకు ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయం. సినిమా ప్రపంచంలో నటీమణులు కూడా బాగా సంపాదిస్తున్నారు. కానీ కొందరు చేసే మోసానికి బలైపోతున్నారు.

ఇలిపిల్ల సూర్యనారాయణ, విజయవాడ.

ఆకర్షించిన మమ్మీలు

'చూద్దామా'లో మమ్మీల విషయాలు ఆకర్షించాయి. ప్రపంచ అద్భుతాల్లో ఒకటైన పిరమిడ్లు, ఈజిప్టు సంస్కృతి, బంగారు ఆభరణాల మ్యూజియం... అనేక విషయాలు తెలుసుకున్నాం.

నూతి నారాయణ, హైదరాబాద్.





చికెన్ ఇరానీ

కావలసిన పదార్థాలు

చికెన్ - అర కిలో, టమాటాలు -పావు కిలో
ఉల్లిపాయలు -పావు కిలో, అల్లంవెల్లుల్లి ముద్ద -20 గ్రాములు
నూనె - 2 స్పూన్లు, పచ్చిమిర్చి ముద్ద - 2 స్పూన్లు
గుడ్లు -2, కొత్తిమీర - 1 కట్ట, దాల్చిన చెక్క - 2
వెన్న - 50 గ్రాములు, బిర్యానీ ఆకులు - 2

తయారు చేసే విధానం

చికెన్ ముక్కలు పెద్దగా కోసుకుని శుభ్రం చేసుకోవాలి. నూనెలో దాల్చిన చెక్క, బిర్యానీ ఆకులు వేయించాలి. అందులోనే టమాటా ముక్కలు, అల్లం వెల్లుల్లిముద్ద, ఉల్లిపాయ ముక్కలు, తరిగిన కొత్తిమీర వేయించాలి. తర్వాత పచ్చిమిర్చి ముద్ద, చికెన్ ముక్కలు వేసి అరగంట ఉడకనివ్వాలి. కొద్దిగా నీళ్లపోసి మధ్య మధ్యలో కలుపుతూ సన్నని సెగ మీద ఉడకనివ్వాలి. తర్వాత గుడ్లు పగుల్లగొట్టి ఒక పాత్రలో వేసి బాగా గిలక్కొట్టి ఉడుకుతున్న కూరలో కలపాలి. గుడ్లు కూడా ఉడికిన తర్వాత దానిపై వెన్న వేసి స్టౌమీద నుండి దించి కొత్తిమీర చల్లుకోవాలి.



క్యాబేజీ కట్‌లెట్స్

కావలసిన పదార్థాలు

క్యాబేజీ - అర కిలో, ఉల్లిపాయలు - 2, పచ్చిమిర్చి - 5
బంగాళ దుంపలు - పావు కిలో, కోడిగుడ్డు - 1
జీడిపప్పు - 50 గ్రాములు, కొత్తిమీర - 1 కట్ట, ఉప్పు - తగినంత
నూనె- వేయించటానికి సరిపడా, లవంగాలు - 10, కారం - కొంచెం

తయారు చేసే విధానం

క్యాబేజీ, పచ్చిమిర్చి, ఉల్లిపాయలు, కొత్తిమీర సన్నగా తరిగి పెట్టుకోవాలి. బంగాళదుంపలు ఉడికించి మెత్తగా చేసుకోవాలి. బాండీలో నూనె వేసి తరిగిన ముక్కలను విడివిడిగా వేయించుకోవాలి. జీడిపప్పు ముక్కలు కూడా వేయించాలి. పైవన్నీ కలిపి కొద్దిగా ఉప్పు, కారం వేసి పెట్టుకోవాలి. కోడుగుడ్డు సొన తీసి ఒక గిన్నెలో వేసి నురగ వచ్చేవరకు చిలక్కొట్టాలి. బంగాళదుంప ముద్దలో వేయించి పెట్టుకున్న ముక్కలను కలిపి చిన్నచిన్న వడల్లా చేసుకుని పక్కన పెట్టుకోవాలి. వాటిని కోడిగుడ్డు సొనలో ముంచి కాగిన నూనెలో వేయించాలి.

పనీర్ మసాలా

కావలసిన పదార్థాలు

పనీర్ - 2 కప్పులు, వెన్న - 2 స్పూన్లు
టమాటా జ్యూస్ - అర కప్పు, ఉల్లిపాయ ముక్కలు - 1 కప్పు
గసాలు - 4 టీ స్పూన్లు, కారం - అర టీ స్పూను
జీడిపప్పు- పావు కప్పు, అల్లం వెల్లుల్లి పేస్ట్ - 1 టీ స్పూను
గరం మసాలా - 1 టీ స్పూను, నూనె - తగినంత

తయారు చేసే విధానం

పనీర్ ముక్కలను కొద్దిగా వేయించాలి. ఉల్లిపాయ ముక్కలు, గసాలు, జీడిపప్పు పేస్ట్ చేసి ఉంచుకోవాలి. దాన్ని నూనెలో వేయించి టమాటా జ్యూస్‌ను కలపాలి. దానిలో గరమ్ మసాలా, కారం వేసి కొంచెం నీళ్ల పోసి 2 నిమిషాలు ఉడికించాలి. తర్వాత పనీర్ ముక్కలు కలిపి కొద్దిగా ఉడికించి, వెన్న వేయాలి. అంతే పనీర్ బటర్ మసాలా రెడీ.





నాన్

కావలసిన పదార్థాలు

మైదా - 2 కప్పులు
వంట షోడా - అర టీ స్పూన్
పంచదార - 1 టీ స్పూన్
ఉప్పు - తగినంత, పెరుగు - అర కప్పు
వేడి నీళ్లు - కలపటానికి సరిపడా
గసాలు - 2 టీ స్పూన్లు
నూనె - పావు కప్పు

తయారు చేసే విధానం

మైదాలో తినే షోడా, ఉప్పు, పంచదార, పెరుగు, 2 స్పూన్ల నూనె కలపాలి. ఈ మిశ్రమానికి వేడినీళ్లను చేర్చి ముద్దగా కలపాలి. దీన్ని 2 గంటలు తడి బట్టలో నానబెట్టాలి. ఇలా చేయటం వల్ల పిండి పొంగుతుంది. నానిన తర్వాత మరోసారి పిండిముద్దని బాగా కలిపి చిన్న చిన్న ఉండలుగా చేసుకోవాలి. వీటిని నాన్ షేపులో చేసుకుని పైన గసాలు చల్లి రెండు వైపులా నీళ్ల తడి చేయాలి. పెనాన్ని స్టౌ మీద తిప్పి పెట్టి దాని పైన నాన్‌ను కాల్చాలి. పెనం పైనుండి తీసిన తర్వాత నెయ్యి లేదా వెన్న రాసి పనీర్ బటర్ మసాలా కూరతో వడ్డించాలి.

కవిత్వమ్

సామ్రాజ్యమా...



గ్రహాంతర వాసులే
నిరంకుశ శక్తులై
భయంకర కక్షతో
భూమిపై పడితే
ఊరకనే ఉండునా
ఈ ప్రపంచ మార్గం?

అగ్రరాజ్యములే
సార్వభౌమతమని
ఆక్రమణలకోసం
ఉపక్రమిస్తే
సుద్దకుంటుందా
ఏ చిన్నదేశం?

గణనీయమైన గణన
గర్జించిందని
సర్వహక్కులు సిద్ధించాయని
సమస్త శక్తులను
గుప్పిట పెట్టుకుని
ధనాగారాలపై
గద్దల్లా వాలి
దేశ కుంభస్థలాన్నే
పొడిచేస్తుంటే
తుళ్లిపడి సొమ్మసిల్లిందేం
ఓ అగ్రసామ్రాజ్యం!

అగ్రసరులుగా
అవతరించి
కీలక వ్యవస్థలో
పాళి ఆడుతూ
బాండాగారాలు
బద్దలుకొట్టి
దేశ భాగ్యమును కొల్లగొడితే
ఊరకనే చూస్తున్నదేం
ఓ రుద్ర స్వరూపం?
అర్ధరాత్రిలో నిద్రమరచి
స్వతంత్ర శక్తిగా అవతరించిన
ఓ మహా దిగ్గజం!

వ్యవస్థ లోపమై
అవస్థ శాపమై
మోసగాళ్లకి జాక్‌పాట్!
మేధాశక్తులకు బ్లాక్‌స్పాట్!
నేటికీ, యావజ్జాతికీ
రోటీ, కపడా, మకాన్ కే
టికానా లేదు!
మరి, త్రిశంకు స్వర్గం
అఖండ దుర్గం
సృష్టికర్తల స్వయం భూతులం
అని పదే పదే అఘోరిస్తే
అహంకార అవివేకమా

నిరంకుశత్వం
అభిగమ్యమా!

కనుమరుగైపోదా
నీ హుందాతనం
ప్రజల సంప్రేరణతో సాగే
ఓ ప్రజాస్వామ్యం?

ప్రశ్నించే నోటికి
అహంకారి పోటు!
యత్నించే మనిషికి
అధికారి వేటు!
అందుకే భయం
ముసుగులో ఇంతజనం
కునుకుపాటు!
కాదు, కేవలం
దేశ పౌరుల సద్దుబాటు
కానీ, ఇదే, ఒక
భయంకర దురలవాటు!

గిర, గిర తిరిగే బొంగరానికి
సూత్రం తాడు!
మరి, గంగిరెద్దుల్లా తలలూపే
జ్ఞానచక్షువులు అకృత్యములకు
హుకుం! ఎవరు?

- ఎ.ఆర్.శ్రీపాద

కుట్ర

దుఃఖాన్ని అనివార్యం చేసినపుడు
నేను విచారంగా
ఎందుకు బ్రతుకుతాను చెప్ప
ధిక్కారంతోనే బ్రతుకుతాను
నీళ్లుండి దప్పికకేడుస్తున్న
బ్రతుకునాది
గోదాం నిండా ధాన్యం నిల్వలే
ఆకలికేడుస్తున్న
జిందగీ నాది
తోటనిండా పూలు పండ్లు
వేటికీ నోచుకోని
జీవితం నాది
కావాలని చేశావు కుట్ర
ఏసి రూంలో
పచ్చనోట్ల కుట్ర నీది
రాజ్యాంగం సాక్షిగా
ప్రజాస్వామ్య కుట్ర నీది
శ్రమ చేతులను దోచి
ఆకలికి చంపి
అంతస్తులమీద అంతస్తులు
కడుతున్న కుట్ర నీది
నీ కుట్ర నాకు తెలిసిపోయింది
ఎందుకేడుస్తాను
ధిక్కరణ ఆయుధమిప్పుడు
తెలుసా?

- సిహెచ్.మధు

పరాయీకరణ

యాంత్రీకరణ
కులవృత్తులను కూల్చింది కానీ
కులాల్ని కాదు
మార్కెట్ సెంటర్లో
శ్రామికున్ని నిలబెట్టి
నిలువునా తోలొలిచింది
ఇప్పుడూ...
కులాలింకా బలంగానే వున్నాయి
శ్రమజీవులే
పరాయీకరణ చెందారు

- పి.పున్నారావు



SPEAK ENGLISH FLUENTLY

6 లక్షలమందికి పైగా నేర్చుకున్న కోర్సు.

తెలుగు తెలిస్తే చాలు...
ఎవరయినా ఇంగ్లీష్ నేర్చుకోవచ్చు

రోజుకు ఒక గంట చాలు...
సులభ సూత్రాలతో ఇంగ్లీష్ నేర్చుకోండి

అనేక సంవత్సరాల కృషితో, విద్యార్థుల సమస్యలను దృష్టిలో పెట్టుకొని, ఈ సులభ సూత్రాలను తయారుచేశాం. ఇంగ్లీష్ నేర్చుకోవటం సులభంగా మార్చేశాం. మీకు తెలుగు తెలిస్తే చాలు... మీరు ఇంట్లో ఉంటూనే చాలా సులభంగా ఇంగ్లీష్ నేర్చుకోవచ్చు.

K.V.R. B.Com.,B.L., (Director)

స్పోకెన్ ఇంగ్లీష్‌లో శిక్షణ నిర్వహిస్తున్న కె.వి.ఆర్.

కూపన్ పంపండి లేదా SMS పంపండి.

CHENNAI: 0-97890 99589

పై సెల్‌ఫోన్ నెంబరుకు మీ పూర్తి పేరు, ఇంటి నెం. ఊరిపేరు, ఫోన్ నెం., పిన్‌కోడ్‌లతో సహా వివరంగా మీ అడ్రసును SMS చేయండి. మా సెల్‌ఫోన్ 24 గంటలూ కంప్యూటర్‌కు లింక్ చేయబడి ఉంటుంది. మీ అడ్రసు ఆటోమేటిక్‌గా కంప్యూటర్ రిసీవ్ చేసుకుంటుందని తెలుసుకోగలరు. కోర్స్ ఫీజు రూ.1000/-లు. ఇది 5 నెలల కోర్స్. రోజూ ఒక గంట చదివితే చాలు. ఈ కోర్సులో 10 పుస్తకాలు, 1 CD ఉంటాయి. మీకు ఏమయినా సందేహాలు ఉంటే, లెటరు వ్రాసి తెలుసుకోవచ్చు. 10 రోజులలో పోస్ట్‌మేన్ కోర్స్ ప్యాకెట్ తీసుకొని వస్తాడు. అప్పుడు పోస్ట్‌మేన్‌కు రూ.1000/-లు చెల్లించి కోర్స్ మెటీరియల్ పొందవచ్చును. SMS పంపడానికి అవకాశం లేనివారు ఈ ప్రకటనలో ఉన్న కూపన్‌ను పూర్తిచేసి పంపండి.

ఈ కూపన్ పూర్తి చేసి వెంటనే పంపండి.

H.O.CHENNAI

KVR INSTITUTE TM

AWARD WINNER

New No.26, Chari Street, T.Nagar, Chennai - 17.

నాకు కె.వి.ఆర్. ఇంగ్లీష్ కోర్స్ వి.పి.పి.లో పంపండి. పోస్ట్‌మేన్‌కు రూ.1000/-లు చెల్లించి పాకెట్ తీసుకుంటాను.

Name: ....

Address: ....

.... Pin Code: ☐☐☐☐☐☐

ప్రత్యక్ష శిక్షణ కేంద్రాలు: ● **SURYAPET:** Vinayaka Degree College, Beside Canara Bank. **Cell:** 93913 68484, 92469 65030. ● **KHAMMAM:** Beside:Kaveri Restaurant, WyraRoad, **Cell:** 94409 11478. ● **CHIRALA:** D.No.13/11/10, Polimera Road, M.M.R.Complex, **Cell:** 98488 35625. ● **TANUKU:** D.No.27-8-11, Jeediguntavari Street, **Cell:**9392210039. ● **PALAKOL:** Beside: Chaitanya Hospital, Near:Telephone Exchange. **Ph:**228800, **Cell:**9247463900. ● **CHITTOOR:** M.B.R.Complex,D.I.Road, **Ph:**232502. **Cell:**98852 81530, 9052180134. ● **ADONI:** D.No.21-121, 1st Road, S.K.D. Colony, Near: Montessori School, **Cell:**93916 44633, 98855 12384. ● **KURNOOL:** D.No. 62/2, Fort, Near : Central Library, **Cell:**93915 49930. ● **DHONE:** Opp: Raja Theatre, Kothapeta, **Cell:**93904 95239 ,99480 32431 ● **TADIPATRI:** Vaddi Variety Hall, Shop No.26, Upstairs, C.B.Road, **Cell:**93473 53709,92900 91456.

ప్రత్యక్షశిక్షణా కేంద్రం ప్రారంభించాలనుకొనే వారు 93466 54210 నెంబర్‌కి ఫోన్ చేసి సంప్రదించండి.

పాత కథ

బబ్బబ్బా

శివరాత్రికి రామతీర్థాలు వెళదామని ఉబలాటపడ్డాను. పడ్డట్టే మా వాళ్ళు ఖర్చుకి ఒక రూపాయి యిచ్చేరు. నలుగురిని పోగు చేసుకుని జట్కా కట్టించుకు పోదామనుకున్నాను. కానీ రామతీర్థాలకి రావడాన్కి మా వీధిలో మిత్రులు, స్కూల్లో మిత్రులు మా గేంగు గేంగంతా రావడాన్కి సిద్ధమైనారు. అందులో చాలామంది బీదవాళ్ళు, జట్కాలూ, గిట్కాలూ ఎక్కడా? నడిచిపోదాం సరదాగా అన్నారు. పైగా నేను తెచ్చిన రూపాయి పైఖర్చు పెట్టుకుందాం అన్నారు. పెద్దవాళ్ళల్లో అధిక సంఖ్యాకుల నిర్ణయానికి ఒప్పుదల కుదరదు కాని పిల్లల్లో నలుగురాడిన మాట ప్రకారం నడుచుకోక తప్పదు. అందుచేత వాళ్ళందరితోపాటు రాంభజన చేస్తూ తొమ్మిది మైళ్ళూ చక్కగా నడిచీసేను.

ఇదెక్కడ. బాగా చిన్నతనంలో ముచ్చట, అప్పటికింకా బట్టిప్పుకొని అయ్యు కోనేట్లోపడి ఈత నేర్చుకుంటూ ఉండేవాళ్ళం. నేను చెప్పబోయేది ఆ రోజుల్లో ముచ్చటే.

చిన్నప్పటినుంచీ కనిపెడుతున్నాను. ఊళ్ళోవాళ్ళైతేనేం. స్కూల్లో వాళ్ళైతేనేం నా స్నేహితుల్లో సన్నిహితులంతా బీదవాళ్ళు. ఆ కారణం చేత చిన్నప్పటినుంచీ నాకన్నీ బీద అలవాట్లే. అందుకే ఆ వేళ రామతీర్థాలు నడవవలసి వచ్చింది.

ఈ బీద స్నేహితుల మూలాన్న నేనెప్పుడు సినీమాకెళ్ళినా నేల టిక్కట్టు వాళ్ళతోపాటు కొనుక్కునేవాణ్ని. నాలుగోఫారంకి వచ్చేవరకూ లెక్కా పత్రం లేనన్ని సినీమాలు చూసేను. కాని ఎప్పుడూ నేలటిక్కట్టు కొనుక్కునే వెళ్ళేను. ఆ రోజుల్లో నేల రెండణాలు. బెంచీ మూడణాలు. కుర్చీ నాలుగణాలు. ఒక్కనాడు చెప్పుకోడానికైనా కుర్చీకికాదు సరికదా బెంచీకైనా వెళ్ళి ఎరుగను. ఉమ్ముల్లో, చుట్టా, బీడీ పీకల్లో, జిమజిమలాడే నేలమీద న్యూసు పేపర్లు పట్టుకొనిపోయి పరుచుకొని కూర్చునేవాళ్ళం.

నేను నేలకి వెళ్ళేవాణ్ణని మా వాళ్ళకి తెలియదు. తెలిస్తే హర్షిద్దురా? వెధవల సహవాసం చేసి వెధవ బుద్ధులకి అలవాటు పడ్డానని తిడుదురు. కాదామరి? మా పెద్దలంతా నియ్యోగి ప్రభువులు. మీసాలకి సంపెంగ నూనె రాసుకొనే జాతి.

నేలకెళ్ళడం తప్పు కిందా, తక్కువ కిందా నాకా రోజుల్లో ఎన్నడూ తట్టలేదు. సినీమాకి వెళ్ళడమే గొప్ప. నలుగురితో కలిసి వెళ్ళడమే సరదా. కథానాయకుని కత్తిసామూ, గుర్రపుస్వారీ, ప్రాణాలు ఉగ్గబెట్టుకొని చూడ్డం, కథానాయకి కలువల కోనేట్లో జలకమాడుతూ ఉంటే జాగ్రత్తగా గమనించడం, నలుగురం ఆ మజాలన్నీ కూడబలుక్కోవడం మా అలవాటు. పెద్దలు రిజర్వుడులోకి ఎంత దర్జాగా వెళ్తారో అలాగ నేలకి వెళ్ళేవాళ్ళం. చిన్నపిల్లలకి ఏంకావాలి? సినీమాలో ఆట మధ్యన కేకలెయ్యడం, గల్లంతు చెయ్యడం. అది నేలలో కూర్చుంటేనే సుళువుగా సాగుతుంది. ఇప్పుడు నేను సలహా యిస్తాను. పద్దెనిమిదేళ్ళలోపు పిల్లలంతా ఆఖరు తరగతికే వెళ్ళాలి. కుర్చీల్లో మన పక్కని కూర్చొనే పెద్దమనుష్యుల చచ్చు సంభాషణకన్నా నేలని కూర్చొనే మామ్మూలు మనుషుల మాటల్లో నువ్వూ నేనూ నేర్చుకోదగ్గ విజ్ఞానం చాలా ఉంది.

నేనూ నా స్నేహితులూ, నా అలవాట్లూ అలాగుండగా మా యింటికి విశాఖపట్నం నుంచి చుట్టాలు వచ్చారు. వాళ్ళెక్కడ బాబూ? వాళ్ళని చూస్తే నేను హడలెత్తిపోయాను. పాప్యులైను షర్టు, బ్లేజర్ కోట్లూ, సిల్కు పంట్లాలూ, బూట్లు వాళ్ళు మామూలుగా ధరించేవాళ్ళు. ఆకుజోళ్ళు తొడిగి ఖద్దరు దుంగిడీ షరాయిలూ, బురఖాల్లాంటి కోరా చొక్కాలూ నేను కట్టేవాణ్ణి. వాళ్ళ వేషం ఖరీదైనదే అయినా నేను తేలిగ్గానే ఈసడించే వాణ్ణి. అంత ఖరీదైన బ్లేజరూ ఆ రోజుల్లో ఆరణాల ఖద్దరు చెక్కుకి తీసి కట్టు అయింది. విదేశీ వస్త్ర దహనకాలం, ఖద్దరు ఎంత గోనెవాటంగా ఉంటే అంత గొప్ప. ఖద్దరు కట్టుకుంటే గౌరవం వచ్చేది. ఖద్దరు కట్టుకొనేవాడు దేశభక్తుడూ, స్వార్థరహితుడు, సత్యవ్రతుడు, త్యాగమూర్తి అనుకొనేవాళ్ళు. ఇప్పుడు మనందరికీ తెలుసు. ఖద్దరు పులులు ధరించే మేకతోలు కూడా అయిపోయింది. హింసకీ అసత్యానికీ చక్కటి మేలిముసుగు అయిపోయింది కూడా.

విశాఖపట్నం వాళ్ళు కాఫీ హోటళ్ళలో పూటకి మూడేసి అణాలు మేసేవారు. నేనా రోజుల్లో కాఫీ హోటలు కెళ్ళడమే మహాభాగ్యం. పొద్దున్నే కుండలో చద్దెన్నం తినేవాణ్ని. వాళ్ళు పూర్తిగా కాఫీరాయుళ్ళు. నవనాగరికులు, చిటికినవేలు సందులో సిగరెట్లు ఇరికించి దమ్ము ధారాళంగా లాగేవాళ్ళు. నేను సిగరెట్టు పెదిమికి అంటించి ఎరగను.

వాళ్ళు సినిమాకెప్పుడూ వెళ్ళడం కుర్చీకే! దిగువ క్లాసులు వాళ్ళు ఎరగే ఎరగరు. కుర్చీకాదు సరికదా జన్మానికి బెంచీలోకి వెళ్ళి ఎరగనాయె. వాళ్ళ దర్జా నా గుండెల్లో బ్రహ్మజెవుడు ముల్లులా గుచ్చుకొంది.

విశాఖపట్నం చుట్టాలంతా వెళ్ళిపోయేరు. వాళ్లెవరో కాదు, మా పెత్తండ్రిగారి కుటుంబమే. మా పెత్తండ్రి భార్య వంక చుట్టాలు కొందరు. మా పెత్తండ్రిగారి పెద్దబ్బాయి మాత్రం, సెలవలన్నాళ్ళూ మా ఊళ్ళో మాతో ఉండిపోయేడు. రోజూ నా గేంగు స్నేహితులందర్నీ పోగుచేసి అన్నయ్యతో కలిసి నల్లచెరువుకి పోయి బిళ్ళాకర్రా ఆడుకొనేవాళ్లం. శ్మశానంలో గెంతులేసేవాళ్ళం. మెట్టలెక్కేవాళ్ళం.

సినిమా కెళదామని అన్నయ్య ఇంట్లో రోజూ గొడవ పెట్టేవాడు. మా నాన్న వెళ్ళడానికి వీల్లేదని గట్టిగా చెప్పాడు. ప్రతి వెధవ ఫిల్ముకీ వెళ్ళి డబ్బు తగలెయ్యటం మంచిదికాదని మా అన్నయ్యకి మా నాన్న చాలా నచ్చచెప్పేడు. విశాఖపట్నం వాళు ్ళ వచ్చిన ప్రతి ఫిల్ముకీ వెళతారట. ఊళ్లో కొచ్చిన ప్రతి ఫిల్మూ చూసి తీరాలని వాళ్ళ సిద్ధాంతం. గోడలమీద పోస్టర్లు చూసీ చూడడంతో అన్నయ్య గోల మళ్ళా ప్రారంభించేడు. ఆ ఫిల్ములాంటి ఫిల్ము వెనక తీయలేదని, ముందు తీయలేరని బారెడేసి కాయితాలు ఊరంతా పంచిపెట్టేరు. ఊరు గోడలన్నీ పన్నెండేసి అడుగుల రంగు రంగుల పోస్టర్లతో నిండిపోయాయి. వొంటెద్దు బళ్ళ గూళ్ళమీద పల్లెటూళ్ళ నుంచి వచ్చే రెండెడ్ల బళ్ళగూళ్ళమీదా ఆ ఫిల్ము పోస్టర్లే. ఆ ఫిల్ముకి వెళ్లకపోతే ఎందుకొచ్చిన జన్మ అంటాడు అన్నయ్య. ఎడ్వరుటైజుమెంటుకి మోసపోయి అన్నాడో, తెలిసే అన్నాడో "ఫిల్ము మంచిదే వెళుదురుగానిలెండి" అని మా నాన్న భరవసా యిచ్చేడు. ఫలానా రోజుని వెళ్లండని కూడా చెప్పేడు.

మేము సినిమాకి వెళ్తున్నామన్న సంగతి ఊరూవాడా ఎగరగొట్టేసేము. మా గేంగు వాళ్ళందరికీ టిక్కట్లు నేనే కొని తీసుకెళదామని కూడా నిశ్చయించుకున్నాను.

మా గేంగు విషయం చెప్పాలి, మొదట్లో మా గేంగు చాలా పెద్దది. అల్లరికి, రౌడీ తనానికి ఊళ్లోఉన్న అన్ని పేటలకీ పేరుమోసింది. మా గేంగు పేరు చెపితే ప్రతి స్టూడెంటుకీ హడలే. అంతా ఒక్కమాట మీద నిలబడే వాళ్ళం. గ్రిగ్గుటూర్నమెంట్లు వచ్చేయి. దెబ్బలాటలు ప్రారంభమైనాయి. నువ్వెంతంటే నువ్వెంతంటూ పోటీలు బయల్దేరాయి. స్పోర్ట్సు సౌభ్రాతృత్వాన్ని, ఐకమత్యాన్ని, ద్వేషరాహిత్యాన్ని అభివృద్ధి పరుస్తాయని మా మేష్టర్లు చెప్పగా, కాంపోజిషన్లు రాసేము. అవి సర్వత్రా నిజమేమోకాని మా గేంగు విషయంలో మాత్రం తల్లకిందులైంది. ఎదుటపార్టీ వాళ్ళని చూస్తే పంతం, మత్సరం, కోపం మాలో మహావృక్షాల్లా పెరిగిపోయాయి. మా తగవులు ఎన్నిసార్లో తన్నుకోడందాకా వచ్చాయి. మా గేంగు రెండు పార్టీలైపోయింది. టోర్నమెంటు నుంచి వెనకటి మిత్రులు శత్రువులైపోయేరు. మొదటి ఉధృతం తగ్గినా మా పోటీ, పంతగొట్టుతనం మమ్మల్ని విద్యార్థిదశ వదలిపెట్టేదాకా వదలలేదు. అంచేత మాగేంగు సినీమాకు వెళ్తున్నామనగానే మా ఎదటి పార్టీ కూడా బయల్దేరింది.

మాగేంగు కావేళ నేనే నాయకుణ్ణి. నాకు గర్వంతో భుజాలు పొంగిపోయేయి.

సైన్యాన్ని ముందుకి నడిపే నెపోలియన్నై పోయేను. నా పక్కని మా విశాఖపట్నం అన్నయ్య పొడుం రంగుబ్లేజరు కోటు తొడుక్కుని నడుస్తున్నాడు. వెనుక నలుగురు మిత్రులూ ఉన్నారు. విదేశీ బట్టలంటే కిట్టకపోయినా బ్లేజర్ కోటు అన్నయ్య పక్కనడుస్తూ ఉండగా నడిబజారులోంచి ఎదట పార్టీవాళ్ళు చూస్తు ఉండగా వెళ్ళడం నాకు భుజాలు పొంగిపోయేయి.

మా ఎదుట పార్టీకావేళ లీడరు మృత్యుంజయరావు. వాడు రిటైర్డు రైల్వే ఉద్యోగి కొడుకు. చిత్తుగా ఉన్నవాడు. ఉన్నవాడైనా నాలాగే వాడికి అన్నీ బీద అలవాట్లే. మాతోపాటు సినీమాకి నేలకే వచ్చేవాడు. అమాంతంగా ఆరుగుర్ని వెంటబెట్టుకుని ఆ వేళ వచ్చేడు. మమ్మల్ని చూచి వాడు "బొంబాయి బావురుపిల్లి" అని గట్టిగా అరిచేడు. వాళ్ళ జట్టులో ఒకడు "మ్యావ్" అన్నాడు. అదంతా మా మీద సవాలే.

వాళ్ళకి గట్టిగా ఆవేళ కాజా యివ్వాలనుకున్నాను. పూర్తిగా సిగ్గొచ్చేటట్టు, చిన్న బోయేటట్టు చెయ్యాలనుకున్నాను. నా పర్సు ఆవేళ చాలా బరువుగా వున్నాది. నా అన్ననీ నన్నూ చూసి వాళ్ళు ఉడుక్కునేటట్టు చెయ్యాలనుకున్నాను.

సినీమా పెండాలు చేరుకున్నాము. అనవసరమైనా కిళ్ళీ దుకాణానికెళ్ళేము. అందరికీ సోడాలు ఆర్డరు చేసేను. గేసు లేకపోయినా కొట్టువాడు గంటన్నర కీచులు పెట్టిస్తూ బుడ్లు కొట్టేడు. మా వాళ్లంతా సోడాబుడ్లు తాగుతూ వుంటే పొంగిపోయేను. నాకా రోజుల్లో సోడాబుడ్డిని పట్టుకుని తాగడం గొప్పగా ఉండేది. ఈనాటి మన మిత్రులు బాదంఖీర్ కాగితపు గొట్టాంతో పీలుస్తూ ఎంత మురుస్తారో నేనా రోజుల్లో కాణీ సోడాబుడ్డికి అంత మురిసేవాణ్ణి.

మృత్యుంజయరావు తన గేంగునీ కొట్టుదగ్గరికి లాక్కొచ్చాడు. "ఏంవోయి, ఏడు లైమ్ జ్యూస్ లియ్యి" అని మహా గోరోజనంగా ఆర్డరిచ్చేడు. కొట్టువాడు కొట్టడం ప్రారంభించేడు. కొందరు లైమ్‌జ్యూస్ లొద్దని ఆరెంజెలూ, జింజిర్లూ మార్చేసేరు. బురుగులు లేస్తూ పచ్చగా, ఎర్రగా పొంగుతున్నాయి కలర్లు. నాకు మొట్టికాయ పెట్టినట్టయింది. వాళ్ళు మహా గోరోజనంగా తాగి తేన్పులు మొదలెట్టేరు. పెద్దపెద్ద దొంగతేన్పులు. నన్నూ నా సోడాకాయల్ని వెక్కిరిస్తున్న దొంగతేన్పులు. మృత్యుంజయరావు మండమీద నోరుపెట్టి 'బబ్బ బ్బా బ్బా' కొట్టేడు. వాడంత చక్కగా మా గేంగులో ఎవ్వడూ మండమీద నోరుపెట్టి 'బబ్బబ్బా' కొట్టలేరు. మమ్మల్ని ఎగతాళిచేస్తూ వాడు కొట్టిన బబ్బబ్బాకి నావొళ్ళు గంగవెర్రులెత్తింది. పక్కని గౌరవనీయుడైన బ్లేజరుకోటు అన్నయ్య ఉండబట్టికాని లేకపోతే శిఖపట్ల గోత్రానికి దిగిపోవలసిన పరిస్థితే అది. సరే వీళ్ళ రోగం సినిమాలో అణుస్తానుకదా అని సముదాయించుకున్నాను.

డైనమో టప్‌టప్ అంటూ పనిచెయ్యడం మొదలెట్టింది. తెలుగు పట్టణాలు ఆ రోజుల్లో విద్యుచ్ఛక్తికి నోచుకోలేదు. పెండాలుచుట్టూ లైట్లు వెలిగేయి, పెండాలు మీద రంగురంగుల బల్బుల తోరణం ఆకాశంలోకి వెలిగింది. బేండుమేళం ఉత్సాహపూరితంగా వాయించబడ్డది. జనం విరగబడి వచ్చేరు. ఆ ఫిల్ము ఎప్పుడు వస్తుందని నెలల తరబడి ఊరు ఊరంతా కాచుకుని కూచుంది.

టిక్కెట్టుకోసం తోపులాట యుద్ధం ప్రారంభమైంది. నేనే జనాన్ని తోసుకుంటూ వెళ్ళి టిక్కట్లు కొన్నాను. ఆ తోపులాటలోకి వెళ్ళి టిక్కట్లు అంతా తేలేరు. రద్దీ రోజున కిందతరగతి టిక్కట్లు కొని తెచ్చినవాడు చిన్న హీరో అవుతాడు. అంతా అభినందిస్తారు. మా గేంగుకి ఆ సాయంకాలం నేనే హీరోని.

ఆ వేళ నేను బెంచీ టిక్కట్లు కొన్నాను. ఆరుగురికీ ఆరుమూళ్ళు పద్దెనిమిదణాలు. రూపాయి బేడపెట్టి బెంచీ టిక్కట్లు కొన్నాను. నా జన్మకి బెంచీ టిక్కట్టు కొనివెళ్ళడం అదే మొదటిసారి. వాస్తవంగా కుర్చీకి కొనవలసింది. మా విశాఖపట్నం అన్నయ్యా వాళ్ళూ కుర్చీలకే కదూ వెళతారూ? వాడితో మా గొప్ప నిలబెట్టుకోవడానికి, కుర్చీలు కొండానికే తయారుపడ్డాను. మా అన్నయ్యే యింతమందికి కుర్చీలుకొంటే డబ్బు దండుగ ఒద్దనేశాడు. ఆ వేళ మా యింటి స్టాటస్ సంగతి నాకు బాగా తెలిసింది. నేలకెళ్ళడం పరువు తక్కువపనే. బీదస్నేహితులతో పొత్తుగా తిరగడం కూడా తప్పేమో అన్నభావం కలిగింది. అదృష్టవశాత్తు ఆ భావం ఆ క్షణం మాత్రమే ఉంది. ఇప్పటికీ నాకు సన్నిహితులైన మిత్రుల్లో అధిక సంఖ్యాకులు బీదవాళ్ళే. వాళ్ళే నా గౌరవానికి పాత్రులు. ధనికవర్గంలో సన్నిహితులు ఎక్కడోగాని లభ్యంకారు.

బెంచీక్లాసులోకి నలుగురినీ వెంటబెట్టుకుని జమీందారులాగ ప్రవేశించేను. బెంచీలు ఈనాడే బాగులేవు. ఆనాడు నాల్గుకొయ్యలకి చెయ్యి వెడల్పు చెక్కలు దిగ్గొడితే బెంచీలు అయిపోయేవి. వాటిమీదెక్కి కోతుల్లా కూర్చున్నాం. సర్కస్ గేలరీలు బాగా అలవాటేకదూ.

నిలబడి నేనంతా వెతికేను. మా ఎదుటి పార్టీవాళు ళ నేలకొస్తారు. బెంచీల్లో మమ్మల్ని చూచి చిత్తయిపోతారు. మా అన్నయ్య పడనిచ్చాడు కాదు. కానీ కుర్చీలకెళితే మరీ భేషుగ్గా వుండేది.

వాళ్లెవరూ కనబడలేదు. వాళ్ళు మా కాళ్ళదగ్గర నేలని కూర్చుని మమ్మల్ని చూచి ఉడుక్కుని చస్తారని సంబరపడితే వాళ్ళసలు సినిమాకే రాలేదు కాబోలు. నేల కిటకిటా నిండిపోయిందికాని వాళ్ళు రాలేదు. వాళ్ళు రాకపోతే మేము బెంచీల్లో కూర్చొడం చూడకపోతే నా సంతోషం నీళ్ళు పోసిన నిప్పు అయిపోతుంది.

పెండాలెగిరిపోతూ "బబ్బబ్బా" వినపడ్డాది. తుళ్ళిపడి వెనక్కి చూసేను. మృత్యుంజయరావు నన్ను చూస్తూ మండమీద నోరుపెట్టి మళ్ళా బబ్బబ్బా కొట్టేడు. వాళ్లేడుగురూ మొదటి వరుస కుర్చీలలో వరసగా కూర్చున్నారు. ఏడుగురూ కిళ్ళీలు బిగించి సిగరెట్లు వెలిగించేరు. నా వెన్ను విరిగిపోయినట్లయింది. వెన్నెముకలోంచి మండ్రకప్ప పాకినట్లయింది. నన్ను చూచి వాళ్ళంతా చప్పట్లు కొట్టేరు. హాలంతా పడపడా చప్పట్లు కొట్టేరు. ఎవడో పెద్ద ఈలవేశాడు. హాలంతా నన్ను లేవిడీ అంటున్నట్లు ఈలలతో, చప్పట్లతో, గావుకేకలతో, బబ్బాబ్బాలతో నిండిపోయింది. క్రీం అంటూ బెల్లు వాగేదాకా హాలు గల్లంతులతో నిండిపోయింది.

సినీమా ప్రారంభమయింది. నేలలో తెర దగ్గరగా కూర్చుంటే తాటి చెట్టంత కనపడే కథానాయకి సన్నంగా, సలాకులాగా మనిషంతే కనబడ్డాది. మా బృందంలో ఒకడు, "ఇంత చిన్నబొమ్మలు కనబడుతున్నాయేవిటి?" అన్నాడు. ఎప్పుడయినా బెంచీ మొహం ఎరిగితేనా? మా అన్నయ్య నన్ను గోకి "ఎవడీ బెంటు? వీణ్ణి నేలకు తోసేలేకపోయావూ? కంపు వెధవ" అన్నాడు. మా అన్నయ్యకి నేనో బెంటునని తెలీదు, వాడి కంటికి బెంటుగా కనపడ్డ మిత్రుడు యిప్పుడు పిహెచ్‌డి పూనాలో ఉన్నాడు. మా అన్నే స్కూలు ఫైనల్ తగలేసి క్లబ్బు మెంబరై పోరాంబోకుల్లో కలిసిపోయేడు.

మా ఎదుటి పార్టీవాళ్ళు ఆ మర్నాటినుంచీ నాకు బెంచీ అని పేరు పెట్టి ఉడికించేవాళ్ళు. వాళ్లుడికించినట్టే నేను ఉడుక్కునేవాణ్ణి. ఉడుక్కోకూడదనుకుంటూనే ఉడుక్కునేవాణ్ణి. వాళ్ళని కత్తిపీట పట్టుకుని మా అవ్వ దూట తరిగినట్టు తరిగేద్దామని ఉండేది.

మృత్యుంజయరావు తినిపించిన కురిడీ నన్ను మూడు సంవత్సరాలు పీడించుకుతింది. నాకా సంగతి జ్ఞాపకానికొస్తే చాలు ఆ రోజున పడ్డ బాధంతా మళ్ళా వచ్చిపడేది. వొళ్ళు మండిపోయేది. ముక్కుపుటాలెగిరిపోయేవి. ముచ్చెమటలు పోసేవి. చేతకానితనంతో ఒళ్ళు కంపించేది. ఎవడైనా "బబ్బబ్బా" కొడితే చాలు తుళ్లిపడి చూసేవాణ్ణి. నాడు పడ్డ బాధంతా మళ్ళా పడేవాణ్ణి.

అప్పటి వాళ్లందరమూ పెద్దవాళ్ళమయ్యాము. ఇప్పుడు కనపడితే కుశల ప్రశ్నలు వేసుకుంటాము. ఆ చిన్ననాటి వైరాలు జ్ఞాపకం వస్తే జాయింటుగా నవ్వుకుంటాము. ఈనాటికీ ఎవడేనా "బబ్బబ్బా" కొడితే ఆనాటి కథ జ్ఞాపకం వస్తుంది. ఆనాటి నన్ను చూసి ఈనాటి నేను నవ్వుకుంటాను.

- చాగంటి సోమయాజులు

సినిమా కబుర్లు

టాలీవుడ్ చేజారిన అగ్రస్థానం



భారతదేశంలో తెరపై బొమ్మలు మాట్లాడడం మొదలై, 80 ఏళ్ళు పూర్తయ్యాయని 'అశీతి' (అంటే సంస్కృతంలో ఎనభై అని అర్థం) పూర్తి ఉత్సవాలు జరుపుకొంటున్నాం. తెలుగు మాటలు, పాటలే ఉన్న తొలి తెలుగు సంపూర్ణ టాకీ 'భక్త ప్రహ్లాద' అసలు సిసలు విడుదల తేదీ ఏమిటన్న దానిపై ఇటీవల ఓ పరిశోధనలో సరికొత్త సాక్ష్యాధారాలు వెలుగు చూశాయి. అయినా, వాటిని పట్టించుకోకుండా పాత నమ్మకమైన సెప్టెంబర్ 15నే పట్టుకొని వేలాడుతూ, ఆ రోజే చిత్ర పరిశ్రమ పెద్దలు 'తెలుగు చలనచిత్ర దినోత్సవం' జరిపారు. ఏటేటా, ఆ రోజునే జరుపుతామనీ ప్రకటించారు. పండుగ జరుపుకొనే మాట ఎలా ఉన్నా, సరిగ్గా ప్రస్తుత పరిస్థితిలో తెలుగు సినిమా ఏ పరిస్థితుల్లో ఉందని చూస్తే మాత్రం ఒకింత విచారమే కలుగుతుంది. తగ్గిపోతున్న విజయాలు, దేశ చలనచిత్ర రంగంలో మన చేజారిపోతున్న ప్రముఖ స్థానం ఆందోళన కలిగిస్తాయి.

అవును! తెలుగు చలనచిత్ర పరిశ్రమ ఇటీవల కొద్దికాలంగా సర్రున కిందకు జారిపోతోంది. ఒకప్పుడు దేశం మొత్తంలో అత్యధిక చలనచిత్రాలను నిర్మించి, అగ్ర స్థానంలో నిలిచిన తెలుగు చలనచిత్ర పరిశ్రమ ఇవాళ ఆ స్థానాన్నీ, స్థాయినీ పోగొట్టుకుంది. ఇది ఎవరో అంటున్న నోటి మాట కాదు. గణాంకాలు, బాక్సాఫీస్ వివరాలు చెబుతున్న చేదు నిజం. అందుకు తాజా నివేదికలే సాక్ష్యం. సినిమాల్లో నాణ్యత, వసూళ్ళతో సంబంధం లేకుండా, నిర్మాణమైన చలనచిత్రాల సంఖ్యలో మాత్రం తెలుగు చిత్ర పరిశ్రమ నిన్న మొన్నటి వరకు అగ్రేసర స్థానంలో నిలిచింది. హిందీ చలనచిత్ర పరిశ్రమ కన్నా మిన్నగా, దేశంలోనే అతి ఎక్కువ సంఖ్యలో సినిమాలు నిర్మించే పరిశ్రమగా మనం ముందుండేవారం. అలాంటిది 2009లో మనం చిత్ర నిర్మాణంలో ప్రథమ స్థానం నుంచి రెండో స్థానానికి పడిపోయాం. ఇటీవల విడుదలైన గణాంక వివరాలను బట్టి చూస్తే, మనం ఇప్పుడు అక్కడ నుంచి మరో మెట్టు కిందకు జారాం. నిర్మాణమైన చిత్రాల సంఖ్య రీత్యా 2010లో మనం ఏకంగా మూడో స్థానానికి పడిపోయాం.

దేశవ్యాప్తంగా తగ్గిన చిత్ర నిర్మాణం

చిత్ర నిర్మాణ సంఖ్యలో తమిళ తంబీలు మనల్ని దాటి ముందుకు వచ్చారు. తమిళ చిత్ర పరిశ్రమ రెండో స్థానానికి ఎగబాకగా, తెలుగు చిత్ర పరిశ్రమ మూడో స్థానానికి దిగజారింది. కేంద్ర సెన్సార్ బోర్డు ('సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్' – సి.బి.ఎఫ్.సి) 2010వ సంవత్సరానికి గాను జారీ చేసిన వార్షిక నివేదికలో ఈ సంగతులు వెల్లడయ్యాయి. మన దేశం మొత్తం మీద నిర్మాణమైన చలనచిత్రాల సంఖ్య గత ఏడాది కొద్దిగా తగ్గింది. 2009లో మన దేశం మొత్తం మీద, వివిధ భాషలన్నీ కలిపి 1288 చిత్రాలు తయారయ్యాయి. కాగా, ఆ మరుసటి ఏడాది 2010 కల్లా ఆ సంఖ్య కొద్దిగా తగ్గి, 1274కు చేరిందని సెన్సార్ బోర్డు వార్షిక నివేదిక తెలిపింది.

తమిళం ముందు! తెలుగు వెనుక!!

మన తెలుగు చలనచిత్ర పరిశ్రమ విషయానికి వస్తే, పరిస్థితి కొంత ఆందోళనకరంగా ఉంది. తెలుగులో రూపొందుతున్న చిత్రాల సంఖ్య గణనీయంగా తగ్గుతోంది. 2009లో తెలుగులో నిర్మాణమై, సెన్సార్ జరుపుకొని, సర్టిఫికెట్ పొందిన చిత్రాల సంఖ్య (నేరు తెలుగు చిత్రాలు, అనువాద చిత్రాలు కలిపి) 218. కాగా, గత ఏడాది – అంటే 2010లో ఇది 181కి పడిపోయింది. ఫలితంగా, తెలుగు చలనచిత్ర పరిశ్రమ దేశం మొత్తం మీద ఏకంగా మూడో స్థానంలోకి పడిపోయింది. పొరుగు రాష్ట్రంలోని తమిళ సోదరులు చిత్ర నిర్మాణ సంఖ్యలో మనల్ని దాటి, ముందుకు వచ్చారు. "తమిళంలో గడచిన 2010లో 129 నేరు చిత్రాలు వచ్చాయి. అనువాద చిత్రాలు కలపకుండానే ఇన్ని చిత్రాలు నిర్మాణం కావడానికి తమిళ చిత్ర పరిశ్రమలో ఓ రికార్డు" అని తమిళ చలనచిత్ర చరిత్రకారుడు, జర్నలిస్టు అయిన ఎనిమిది పదుల 'ఫిల్మ్‌న్యూస్' ఆనందన్ వివరించారు. ఈ "2011లో ఆగస్టు చివరి నాటికే తమిళంలో 80 నేరు చిత్రాలు వచ్చాయి. ఈ ఏడాది చివరి నాటికి దాదాపు 140 చిత్రాలు వస్తాయని అంచనా" అని ఆయన పేర్కొన్నారు. సెప్టెంబర్ 7 ఒక్క రోజునే తమిళంలో ఏడు చిత్రాలు రిలీజవడం అందుకు పెద్ద సూచన.

తెలుగు తగ్గడానికి కారణాలెన్నో!

'అరయంగ కర్ణుడీల్గె నార్గురి చేతన్...' అంటు కర్ణుడి చావుకు కారణాల లాగా, తెలుగులో చలనచిత్ర నిర్మాణం తగ్గడానికి కూడా అనేక కారణాలున్నాయి. రాష్ట్రంలో ఎప్పటికప్పుడు మారిపోతున్న రాజకీయ పరిస్థితులు, కొరవడిన ప్రశాంతత, గత రెండేళ్ళుగా తెలుగులో బాక్సాఫీస్ హిట్లు గణనీయంగా తగ్గిపోవడం లాంటివి అందులో కొన్ని కారణాలు. అలాగే, అదుపు లేకుండా పెరిగిపోతున్న నిర్మాణ వ్యయంతో సహా అనేకానేక అంతర్గత సమస్యలు సైతం తెలుగు చలనచిత్ర పరిశ్రమను పట్టి పీడిస్తున్నాయి. మొత్తం మీద చూస్తే, ఇది ఆందోళనకరమైన పరిణామమే! తెలుగు పరిశ్రమకు ఇది మంచి ధోరణి కాదనేది అందరూ ఒప్పుకొనే విషయం. నిజం చెప్పాలంటే, ఇవాళ తెలుగు చిత్ర సీమలో రెగ్యులర్‌గా సినిమాలు తీస్తున్న నిర్మాతలు కూడా చాలా తక్కువే! సినిమాయే లోకంగా బతుకుతూ, అంకితభావంతో ఒకదాని తరువాత మరొకటిగా సినిమాలు తీస్తున్న చిత్రనిర్మాతలు ఇవాళ అట్టే లేరు. "సినీ వ్యాపారమే తప్ప, మరో వ్యాపారం తెలియని నిర్మాతలు ఇవాళ పరిశ్రమలో నూటికి 10 మంది మించి లేరు. నిర్మాతల మండలిలో 928 మంది నిర్మాతలున్నారు. కానీ, వారిలో ఎక్కువ మంది ఒకటి రెండు సినిమాలు నిర్మించి, ఆగిపోయినవాళ్ళే! అయిదు, అంతకన్నా ఎక్కువ సినిమాలు తీసినవాళ్ళ సంఖ్య తక్కువ" అని తెలుగు చలనచిత్ర నిర్మాతల మండలికి ఇటీవలే అధ్యక్షుడైన నిర్మాత బూరుగుపల్లి శివరామకృష్ణ సైతం పేర్కొన్నారు.

కళ్ళు తెరవాల్సిన తరుణం

ఏతావాతా, కొన్నేళ్ళుగా ఏటా అత్యధిక చిత్రాలు నిర్మిస్తున్న ఘనత వహించిన మన తెలుగు చిత్ర పరిశ్రమ ఇప్పుడిలా ఇలాంటి అనేకానేక కారణాల వల్ల ఆ ప్రత్యేకతను కోల్పోవడం విచారకరమే. సినిమాల కథ కథనాల్లో, నాణ్యతలో, జాతీయ స్థాయి గుర్తింపు, అవార్డుల విషయంలో ఇప్పటికే మనం వెనుకబడి ఉన్నామన్నది సినీ ప్రియులం జీర్ణించుకోలేకపోతున్న వాస్తవం. గోరుచుట్టు మీద రోకటి పోటులా ఇప్పుడు చిత్ర నిర్మాణ సంఖ్యలోనూ వెనుకబడ్డాం. ఇప్పటికైనా మన నిర్మాతలు, దర్శకులు, హీరోలు, సాంకేతిక నిపుణులు కళ్ళు తెరవాలి. వాస్తవ పరిస్థితుల్ని గుర్తించాలి. చిత్ర నిర్మాణం ఎందుకు తగ్గిపోతోందో ఆత్మపరిశీలన చేసుకోవాలి. చిత్ర నిర్మాణం తగ్గిపోవడానికి కారణమవుతున్న తమ లోటుపాట్లనూ, కొండకచో వ్యవహార శైలినీ సరిదిద్దుకోవాలి. అప్పుడే మనం మళ్ళీ పూర్వ ప్రతిష్ఠను సంపాదించుకోగలుగుతాం. సినీ వ్యాపార ధోరణుల విశ్లేషణలో అపార అనుభవం ఉన్న కాట్రగడ్డ నరసయ్య కథనం ప్రకారం "ఈ ఏడాదిలో ఆగస్టు నెలాఖరుకు తెలుగులో 81 నేరు చిత్రాలు, 89 అనువాద చిత్రాలు విడుదలయ్యాయి." దాన్నిబట్టి చూస్తే, గత ఏడాది కన్నా ఈసారి తెలుగులో చలనచిత్ర నిర్మాణాల సంఖ్య మెరుగు కావచ్చని ఓ చిరు ఆశాదీపం మిణుకు మిణుకుమంటోంది.

- జయ

విద్యారుణం తీర్చేందుకు...



చదువు'కొనేందుకు' తీసుకున్న రుణాలను తీర్చాలంటే ఏమి చెయ్యాలి. తీసుకున్న అప్పు తీర్చకపోతే 'నీ భార్యను అప్పగించమన్న' భూస్వాములను, ఏమీ చెయ్యలేకపోతే 'ఒళ్లమ్ముకొని' కిస్తీలు కట్టాలన్న మైక్రో సంస్థల ప్రతినిధులను చూశాము. అమెరికాలో విద్యార్థులు కూడా అదే పని చేయాల్సిన పరిస్థితులను అక్కడి సర్కారు కల్పిస్తోంది. 'వాల్‌స్ట్రీట్ ఆక్రమణ' ఉద్యమంలో పాల్గొంటున్న అనేక మంది విద్యార్థులు, యువత తమ దుస్థితిని వినిపిస్తున్నారు. న్యూయార్క్‌లో ఆందోళన జరుగుతున్న లిబర్టీ ప్లాజా వద్ద ఒక యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. వాల్‌స్ట్రీట్‌లోకి చొరబడే నిరసన కార్యక్రమంలో అతను భాగస్వామికాదు. 'నేను నెలవారీ తీర్చాల్సిన రుణం 1,300 డాలర్లు. నా రూము అద్దె మరో 1,300. నాకు వచ్చే వేతనం 2,600. నా ఆహారం, ఇతర అవసరాల కోసం ఏం చెయ్యాలో దిక్కుతోచక 'పడుపు' వృత్తి చేసినందుకు నన్ను పోలీసులు అరెస్టు చేశారు' అని అతడు చెప్పాడు. ఇలాంటి యువకులు, యువతులు అమెరికాలో ఎందరో వున్నారంటే అతిశయోక్తి కాదు. ఇలాంటి వారిని చేరదీసే వారిని 'సుగర్ డాడీ, మమ్మీ'లని పిలుస్తారు. అమెరికాలో చదువుకొనేందుకు విద్యార్థులు తీసుకున్న రుణం ఇప్పుడు 'లక్షకోట్ల' డాలర్లు అంటే 50లక్షల కోట్ల రూపాయలకు చేరింది. వాల్ స్ట్రీట్ జర్నల్ సమాచారం ప్రకారం ప్రస్తుతం కాలేజీ నుంచి బయటకు వెళ్లే విద్యార్థులు డిగ్రీతో పాటు 22,900 డాలర్ల అప్పును కూడా వెంటతీసుకువెళుతున్నారు. ఒబామా 'బడ్జెట్‌కోత'లతో విద్యార్థుల రుణ భారం తడిచి మోపెడౌతోంది. ఇది నల్లవారు, ఆదిమ అమెరికన్ తెగలవారు వెళ్లే విద్యా సంస్థలకు 36 నుంచి 83శాతం సహాయం కోత పడుతోంది. అంటే కోతలకు బలయ్యేది కూడా పేదలే. రుణగ్రస్తులౌతున్నది కూడా వారే. 'విద్య'ను కూడా వ్యాపార సరకుగా మార్చిన తరువాత 'కొనుగోలు' చేసిన వారు 'పూర్తి వెల' చెల్లించక తప్పదు కదా! మన దేశంలో అలాంటి 'కొనుగోలుదారులు' గణనీయంగా ఉన్నారని గమనించిన అమెరికా, ఇతర ధనికదేశాల విద్యావ్యాపారులు మన దేశంలో ప్రయివేటు, విదేశీ విశ్వవిద్యాలయాల ఏర్పాటుకు సర్కారుపై వత్తిడి తెస్తున్నది ఇందుకే.

సూక్ష్మంలో మోక్షం

వెనుకటికెవడో నాకు వెయ్యి రూపాయల దక్షిణ ఇస్తే ప్రతివారికీ ఒక్కొక్క కిలో బంగారం తయారు చేసే మంత్రం చెబుతానంటే జనం విరగబడి సమర్పించుకున్నారట. ఇప్పుడు కూడా అలాంటి మోసాలు ఎన్నో. ఇప్పుడు ప్రపంచంలో ఒక పుస్తకాన్ని అమ్ముకుంటున్నారు. సమాచార విప్లవ యుగం కనుక పుస్తకం కూడా కంప్యూటర్ వైరస్‌కు సంబంధించినదే. వచ్చే ఏడాది ప్రపంచం అంతమౌతుందని సినిమాలు, ఎన్నో పుస్తకాలు వచ్చిన విషయం తెలిసినదే. అలాగే త్వరలో 'ఇంటర్నెట్ (అంతర్జాల) వ్యవస్థ కుప్పకూలిపోతుందని' భయపెడుతున్నది ఆ పుస్తకం. ఈ శతాబ్ది ప్రారంభానికి ముందు కూడా 'వై టు కె' పేరుతో చేసిన గందరగోళం అంతా ఇంతా కాదు. కంప్యూటర్లలో వైరస్ అంటే ఏమిటో తెలుసు కదా. పంచర్లు వేసే వారు తమ షాపుకు అటూ ఇటూ మేకులు, సూదుల వంటివాటిని చల్లుతారని అతిశయోక్తిగా చెప్పుకోవటం తెలిసిందే. అయితే కంప్యూటర్ తయారీ కంపెనీలు తమ కంప్యూటర్లను అమ్ముకొనేందుకు పాత కంప్యూటర్లకు సోకే వైరస్ ప్రోగ్రామ్‌లను తయారు చేసి ఇంటర్నెట్ ద్వారా వ్యాపింప చేశారు. ఇతర దేశాలు, కంపెనీల సమాచారాన్ని 'తస్కరించే'వారు కూడా ఇలాంటి వైరస్‌లను సృష్టించి తమ పని తాము కానిస్తున్నారు. కాన్‌ఫిక్కర్ అనే వైరస్‌ను గుర్తుతెలియని వారు సృష్టించారని అది గత మూడు సంవత్సరాలుగా కోటీ 20 లక్షల కంప్యూటర్లలో చేరి సమాచారాన్ని తస్కరించిందని మార్క్ బౌడెన్ అనే ఒక రచయిత ఏకంగా పుస్తకమే రాశాడు. మీ కంప్యూటర్‌కు కూడా ఎప్పుడైనా సోకవచ్చని ఉచిత సలహా పారేశాడు. అదెలా ఉంటుందో తెలుసుకోవాలంటే మా వెబ్‌సైట్ చూడండి, పుస్తకం కొనండని చెబుతున్నాడు. ఇందులో మనం ఏది చేసినా అతని జేబులు నిండుతాయి. కాన్‌ఫిక్కర్ అనే వైరస్ ఉందని ప్రచారం జరగటంతో దాన్ని నిరోధించే పేరుతో కొందరు తయారయ్యారు. వారు 2009 ఏప్రిల్ ఒకటిన సామూహికంగా కాన్‌ఫిక్‌ను తయారు చేసిన వారి నుంచి వచ్చే ఆదేశంతో మొత్తం సమాచారాన్నంతా వైరస్‌లు తస్కరిస్తాయని ప్రచారం చేశారు. అదంతా వట్టిదే అని తేలిపోయింది. దాంతో వారు మరో కొత్త పల్లవి అందుకున్నారు. కాన్‌ఫిక్కర్ వైరస్‌ను తయారు చేసిన వారు 'మంచిదొంగ'లనే ప్రచారం మొదలు పెట్టారు. డబ్బుకోసం తప్ప మొత్తం విధ్వంసం సృష్టించేందుకు కాదన్నది దాని సారాంశం. అసలు ఇంతకూ అన్ని వ్యవస్థలనూ నిజంగా కాన్‌ఫిక్కర్ నాశనం చేస్తే దాన్ని సృష్టించిన వారి కంప్యూటర్లను కూడా అది వదలదు, పోనీ వదిలినా ఇతర కంప్యూటర్లు లేకపోతే డబ్బెక్కడి నుంచి తీసుకుంటారో !!

పారవేసే ఆహారంతో భూమి వేడెక్కుతుందా?

తిన్నంత తిని వృధాగా మనం పారవేసే ఆహారంతో భూమి వేడెక్కుతుందా? అవునని ఒక సంస్థ చెబుతోంది. ఎలాగబ్బా ? అమెరికాలో ఏడాదికి సరఫరా అయ్యేదానిలో 40శాతం అంటే 5.5 కోట్ల టన్నుల ఆహారం వృధా అవుతోందని అంచనా. క్లీన్ మెట్రిక్స్ అనే సంస్థ అధిపతి కుమార్ వెంకట్‌కు ఒక వర్క్ వచ్చింది. అదేమంటే మాంస వినియోగం వలన పర్యావరణంపై కలిగే ప్రభావం ఏమిటన్న విశ్లేషణ. అయితే అమెరికా ప్రభుత్వం నుంచి తీసుకున్న సమాచారంతో వినియోగదారులు, రిటైల్ వ్యాపారుల వద్ద జరుగుతున్న ఆహార దుబారా ఎంత అని లెక్కిస్తే ఏడాదికి ఆ మొత్తంతో 13.5 కోట్ల టన్నుల గ్రీన్‌హౌస్ గ్యాస్ విడుదలౌతున్నట్లు తేలింది. ఇది మొత్తంగా వెలువడే వాయువులో 1.5 శాతంగా తేలింది. అంటే ఆహార పదార్థాలను పడవేసే వారందరూ వాతావరణాన్ని వేడెక్కించే తప్పు చేస్తున్నట్లే మరి. ఒక కుటుంబం 1800 పౌండ్లకు బాధ్యురాలైతే ప్రతి వ్యక్తి 440 పౌండ్లకు కారకుడట.

- ఎం. కోటేశ్వరరావు



'ఆకాష్' మే హద్దు!

నిన్న 'నానో'...
నేడు 'ఆకాష్'...
అధునాతన సాంకేతిక విజ్ఞానాన్ని అత్యంత చౌకగా అందించి ప్రపంచాన్ని అబ్బురపరచింది భారత్. కంప్యూటర్ టెక్నాలజీని ప్రజల ముంగిటికి తేవాలనే సంకల్పాన్ని నెరవేర్చే దిశలో భారత్ మరో అడుగు ముందుకు వేసి విద్యార్థుల కోసం అత్యంత చౌకగా 'ఆకాష్' పేరుతో ట్యాబ్లెట్ పీసీని రూపొందించింది. ట్యాబ్లెట్ పీసీల హవా నడుస్తున్న ప్రస్తుత తరుణంలో భారత్‌లో పుట్టిన ఈ ట్యాబ్లెట్ పీసీ కంప్యూటింగ్, ఇంటర్నెట్ సదుపాయాలను ప్రపంచం ముంగిట్లోకి తీసుకెళ్లబోతోంది.

దేశంలో విద్యార్థులకు సుమారు రూ.1200లకే అందుబాటులో ఉండే 'ట్యాబ్లెట్ పీసీ'ని ఇటీవల ఆవిష్కరించారు. టచ్ స్క్రీన్ సదుపాయం ఉన్న ఈ 7 అంగుళాల పీసీకి.. 'ఆకాష్' అని పేరు పెట్టారు. ప్రస్తుతం అన్నిరకాల పన్నులతో కలిపి దీని అసలు ధర రూ.2,276. విద్యా సంస్థలకు మాత్రం 50% తగ్గింపు ధరకే ఇస్తున్నారు. వీటిని తయారు చేస్తున్న 'డేటావిండ్' సంస్థ నుండి ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం లక్ష పీసీలను కొనుగోలు చేసింది. 'యూబి స్లేట్' పేరుతో మరిన్ని అదనపు హంగులు సమకూర్చి, రూ.2,999లకు (60 డాలర్లు) మార్కెట్లో విక్రయించేందుకు డేటావిండ్ రంగం సిద్ధం చేస్తోంది. ప్రభుత్వానికి సరఫరా చేసేవాటిలో ఇంటర్నెట్ కనెక్షన్ ఉండదు. కానీ మార్కెట్లో విక్రయించే వాటిలో నేరుగా ఇంటర్నెట్ వినియోగించుకునేందుకు వీలుగా సెల్యులార్ మోడెమ్, సిమ్‌కార్డు కూడా జోడిస్తారు.

ఈ ట్యాబ్లెట్‌పై ఇప్పటిదాకా ఎలాంటి పన్నులను ప్రభుత్వం విధించలేదు. ఐటీని చదువులో అంతర్భాగంగా చేయాలన్న లక్ష్యంలో భాగంగా ప్రభుత్వం ఈ సబ్సిడీ ఇస్తోంది. ఈ ట్యాబ్లెట్‌ను ముందుగా కళాశాలలకు అందుబాటులోకి తెస్తారు. భారత్‌లో వీటి విక్రయాలు డిసెంబర్ నుంచి ప్రారంభమవుతాయి. పాఠశాలలు, కళాశాలల్లో దీనిని ఉచితంగా పంపిణీ చేయాలని కూడా కేంద్రం యోచిస్తోంది. ప్రపంచంలోనే అత్యంత చౌక టాబ్లెట్ పీసీగా ఖ్యాతి గడించినా.. ఆకాష్ సామర్థ్యం తక్కువేమీ కాదు.

రాజస్థాన్‌లోని ఐఐటీ (జోధ్‌పూర్) సారథ్యంలో కెనడాకు చెందిన 'డేటావిండ్' అనే సంస్థ దీన్ని తయారు చేసింది. ప్రస్తుతం ఈ ట్యాబ్లెట్ పీసీలను హైదరాబాద్‌లోనే తయారు చేస్తున్నారు. హైదరాబాద్ శివారులోని మేడ్చల్‌లో ఈ టాబ్లెట్ పరికరాలను తయారు చేస్తున్నారు. డేటావిండ్ కంపెనీ ఆధ్వర్యంలో క్వాడ్ (క్వాలిటీ అండర్ ఏబుల్ డైనమిక్స్) ఎలక్ట్రానిక్ సొల్యూషన్స్ సంస్థ ఈ గ్యాడ్జెట్లను తయారు చేస్తోంది. రెండెకరాల సువిశాలమైన కంపెనీ క్యాంపస్‌లో ట్యాబ్లెట్ల తయారీ ప్రక్రియ కొనసాగుతోంది. ప్రాజెక్టులో భాగంగా 1000 మంది పని చేస్తున్నారు. వీరిలో 65 మంది ఇంజనీర్లు, మిగిలినవారు ఐటీలో ప్రావీణ్యం సంపాదించినవారు. చైనా, ఆగ్నేయ ఆసియా దేశాల నుంచి దిగమతి చేసుకున్న విడి భాగాలతో ఆకాష్‌ను అసెంబుల్ చేస్తున్నారు. ప్రస్తుతం రోజుకు 700 ట్యాబ్లెట్లు తయారవుతున్నాయి. ఈ సంఖ్యను 1,500లకు పెంచే యోచనలో ప్రయత్నాలు సాగుతున్నాయి.

మనదేశంలో ఇంటర్నెట్ వినియోగదారుల 2000-2010ల మధ్య 15 రెట్లు పెరిగింది. అయినప్పటికీ దేశంలో 8శాతం మందికి మాత్రమే ఇంటర్నెట్ అందుబాటులో వుంది. ప్రస్తుతం నెట్ సౌలభ్యం అందుబాటులోలేని వర్గాలకు సైతం 'ఆకాష్' అందుబాటులోకి తెస్తుందని ఆశిస్తున్నారు. దూర విద్య మీద ఆధారపడే గ్రామీణ ప్రాంత విద్యార్థులకు 'ఆకాష్' కొత్త ద్వారాలు తెరవవచ్చు.

సాంకేతిక వివరాలు

ఈ ఆకాష్ ట్యాబ్లెట్‌లో ఇంటర్నెట్ యాక్సెస్, క్లౌడ్

స్టోరేజ్ కోసం వైఫై కనెక్టివిటీ ఉండేలా అత్యంత జనాదరణ పొందిన ఆపరేటింగ్ సిస్టమ్ ఆండ్రాయిడ్ 2.2 (ప్రోయో)ను ఇందులో ఉపయోగించారు. రెండు యూఎస్‌బీ పోర్టులుంటాయి. 256 ఎంబీ ర్యామ్, 2జీబీ ఎస్‌డీ మెమరీ కార్డ్,366 మెగాహెర్ట్జ్ సామర్థ్యం కలిగిన ప్రాసెసర్, గ్రాఫిక్స్ యాక్సిలరేటర్, హెచ్‌డి వీడియో ప్రాసెసర్, 32 ఎక్స్‌పాండబుల్ స్లాట్‌తో పాటు ఎక్స్‌టర్నల్ స్టోరేజీ కోసం 2 జిబి కార్డు, ఇంటర్నల్ స్టోరేజీ కోసం 2 జిబి ఫ్లాష్ వంటి ప్రత్యేకతలున్నాయి. అన్ని రకాల డాక్యుమెంట్లు, ఇమేజ్‌లను సపోర్ట్ చేసే సామర్థ్యం, మల్టీమీడియా, 7 అంగుళాల స్క్రీన్, రెసిస్టివ్ టచ్ స్క్రీన్ వంటి అదనపు హంగులతోపాటు 180 నిమిషాల బ్యాటరీ బ్యాకప్ వుంది.

వ్యాఖ్యానాలు

కొనుగోలు చేసిన తొలి ఏడాదిలో ఆకాష్ సరిగా పనిచెయ్యకపోతే వెంటనే మరో కొత్త పరికరం ఇస్తామని డేటావిండ్ కంపెనీ హామీ ఇస్తోంది. 'ఇంత చౌకగా వస్తోందంటే.. ఇదేం పని చేస్తుందో! చివరికి ఓ చౌకబారు స్టోరేజ్ సాధనంలా మిగులుతుందేమో' అంటూ ఆకాష్‌పై పెదవి విరుపులు వినపడుతుండగా, చదువుకునే పిల్లల అవసరాలకు ఇంతకు మించిన వరం ఏదీవుండదని చాలామంది ప్రముఖులు అభిప్రాయపడుతున్నారు. 'ఇదేమీ వాణిజ్య ప్రయోజనాల కోసం తయారైంది కాదు. నేటి ఆధునిక చదువులకు అవసరమైన సదుపాయాలన్నీ దీనిలో ఉన్నాయి. ఇప్పటికే అత్యాధునిక పీసీలు వాడేవారికి ఇదంత ఆసక్తిగా కనిపించకపోవచ్చుగానీ మన దేశంలో అసంఖ్యాక ప్రజానీకానికి ఇది చాలా ఉపయోగకరమైన పరికరం అవుతుంది' అని విద్యారంగ ప్రముఖుడొకరు వ్యాఖ్యానించారు.

ఏం చేయొచ్చు?

ఈ-బుక్స్ చదువుకోవచ్చు. ఇంటర్నెట్ చూసుకోవచ్చు. హెచ్‌డీ వీడియోలూ చూడొచ్చు. ఆఫీసు డాక్యుమెంట్లు చదువుకోవచ్చు. సోషల్ నెట్‌వర్కింగ్ సైట్లతో అనుసంధానం ఉంటుంది.

లెదర్ కీబోర్డ్ కేస్

టచ్‌స్క్రీన్ అలవాటు లేనివారు వేగంగా టైప్ చేసుకోవటానికి వీలుగా ఆకాష్ పీసీతో పాటు డేటావిండ్ సంస్థ ఒక లెదర్ కేస్‌ను కూడా రూపొందించింది. ఈ లెదర్ కేస్‌లోనే కీబోర్డు కూడా ఉండటం విశేషం. కావాలనుకున్న వారు రూ.300లతో దీన్ని అదనంగా కొనుక్కోవాల్సి ఉంటుంది.

మరింత సమాచారం కోసం ఆకాష్ సంస్థ అధికారిక వెబ్‌సైట్ : http://www.ubislate.com లోను, యూట్యూబ్‌లో http://www.youtube.com/watch?v=fWAVTLhgM5s ద్వారా కూడా పొందవచ్చు.



ట్యాబ్లెట్ పీసీ గురించి

ట్యాబ్లెట్ పీసీ పేపర్ టాబ్లెట్ పరిమాణంలో ఉంటుంది. చూడ్డానికి చిన్నగా ఉన్నా పర్సనల్ కంప్యూటర్‌లో ఉన్న ఫీచర్లన్నీ ఇందులో ఉంటాయి. పీసీ స్క్రీన్‌పై నేరుగా డిజిటల్ పెన్ సహాయంతో పేపర్‌పై ఎలా రాస్తామో అదే విధంగా రాయవచ్చు. స్మార్ట్‌ఫోన్లతో పోలిస్తే స్క్రీన్ పెద్దగా ఉండడం, స్పష్టత వీటికి కలిసి వచ్చే అంశం.. ట్యాబ్లెట్ పీసీల్లో 3జి మొబైల్ సర్వీసు కలిసి ఉండడంతో వినియోగదారులు వీటి పట్ల విపరీతంగా ఆకర్షితమవుతున్నారు. ఒక చోటి నుండి మరో చోటికి తీసుకు వెళ్ళగలిగేలా ఈ టాబ్లెట్ పీసీలను తయారు చేశారు.

విశిష్టతలు

పోర్టబులిటీ, 7 అంగుళాల స్క్రీన్‌సైజు నుంచి లభించే ట్యాబ్లెట్ పీసీల్లో చాలామటుకు ఆండ్రాయిడ్ ఆపరేటింగ్ సిస్టమ్ ఆధారంగా పనిచేస్తాయి. మైక్రోసాఫ్ట్ సంస్థ ప్రత్యేకంగా ఎక్స్‌పి ఆపరేటింగ్ సిస్టమ్‌ని తయారు చేసింది. Windows XP Pro Tablet PC Edition. ఇందులో మనం రాసే రాతల్ని అక్షరాలుగా మార్చే Hand Recognition టెక్నాలజీ లభిస్తోంది. బ్యాటరీ ఎక్కువ కాలం వస్తుంది. ప్రాసెసర్ తక్కువ వేడికి గురవుతుంది. విండోస్ ఎక్స్‌పి ఆపరేటింగ్ సిస్టమ్‌తో పాటు అనేక థర్డ్‌పార్టీ అప్లికేషన్లు లభిస్తున్నాయి. టాబ్లెట్ పీసీతో పాటు అందించబడే పెన్‌ని ఉపయోగించి ఆపరేటింగ్ సిస్టమ్‌లోని, అప్లికేషన్లలోని మెనూలను యాక్సెస్ చేయవచ్చు. ఒకసారి చార్జ్ చేసిన తర్వాత 4 నుండి 12 గంటల వరకు బ్యాటరీ నిలిచి వుంటుంది. విండోస్ ఎక్స్‌పి ఆపరేటింగ్ సిస్టమ్‌పై మనం రెగ్యులర్‌గా ఉపయోగించుకునే ఎంఎస్ ఆఫీస్, పేజిమేకర్, ఫొటోషాప్ వంటి అన్ని అప్లికేషన్లూ టాబ్లెట్ పీసీపై రన్ అవుతాయి. దీని నుంచి ఈ-మెయిల్స్‌ను పంపుకోవచ్చు. సోషల్ అప్లికేషన్లను వినియోగించవచ్చు. బ్లూటూత్, వైఫై, వీడియో రికార్డింగ్, వీడియో, వాయిస్ కాల్స్ వీటి సొంతం. మోడల్‌ను బట్టి ఇంటర్నల్ మెమరీ 16 జీబీ నుంచి 64 జీబీ వరకు ఉంది. కొన్ని ట్యాబ్లెట్లయితే హై డెఫినిషన్ వీడియోను ఆఫర్ చేస్తున్నాయి. వీటితోపాటు Intel Centrino, Dothan ప్రాసెసర్లు, 60-120జిబి వరకు హార్డ్‌డిస్క్‌లతో ఇవి అందుబాటులో వుంటున్నాయి. గీతలు పడకుండా స్క్రీన్‌పై గొరిల్లా గ్లాస్ వుంటుంది. తాజాగా హనీకాం 3.0 వర్షన్ ఆపరేటింగ్ సిస్టమ్ వచ్చింది. సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవడానికి బోర్డు రూమ్ మీటింగులకు వీటిని ఎక్కువగా వాడుతున్నారు.



- కె.ఎక్స్.రాజు

తెలుసుకుందామా...

'మనిషి మనుగడను ప్రశ్నిస్తూ... జీవరాశిని సర్వనాశనం చేస్తూ... జరుగుతున్న యుద్ధాలను వ్యతిరేకిద్దాం' అనే నినాదంతో ప్రపంచశాంతి కోసం చేపట్టవలసిన కార్యాచరణను ప్రపంచంలోని అగ్రదేశాలన్నీ గుర్తించిన నాడు మానవజాతి వికాసం ప్రారంభమవుతుంది. భూభాగాల ఆక్రమణలు, రాజ్యాల మధ్య జరిగిన యుద్ధాల వల్ల వచ్చిన ఉపయోగాలకంటే ఆయా ప్రాంతాల్లో మానవ జాతికి జరిగిన నష్టం చాలా ఎక్కువ. ఆ నష్టాల నుండి కోలుకోవడం అంత తేలికైన విషయం కాదు. తిరిగి జనజీవన స్రవంతిలో కలవడమేకాక చాలామంది కంటే మెరుగైన జీవితాన్ని పొందటం నిజంగా గర్వించదగింది. ఆ బాటలో ఉన్న వియత్నాం ప్రజలను అభినందించాలి.

అభివృద్ధికి దిక్సూచి సోషలిస్ట్ వియత్నాం

- కొల్లి సత్యనారాయణ

వియత్నాం దేశం 145 సంవత్సరాలపాటు ఫ్రెంచి, బ్రిటన్ దేశాల సామ్రాజ్యవాదం, 30 సంవత్సరాలకుపైగా ప్రపంచ పోలీస్ అమెరికన్ సామ్రాజ్యవాదాన్ని ఎదిరించి నిలిచిన చిన్న దేశం వియత్నాం. కా॥ హోచిమిన్ నాయకత్వంలో ఈ రెండు ఆధిపత్యాలను ఎదుర్కోవడంలో వియత్నాం వాసులు సఫలీకృతులై ఈరోజు స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నారు. ఆనాటి ప్రజల బలిదానం నేటి వియత్నాం నవసమాజానికి పునాది అయింది. ఏ సామ్రాజ్యవాద దేశాలైతే వియత్నాంను నాశనం చేయాలని ప్రయత్నించాయో, ఆ దేశాలతోనే తమ ఆర్థికాభివృద్ధి కొరకు స్నేహసంబంధాలను పెంపొందించుకోవడానికి ప్రయత్నించడం నిజంగా అభినందనీయం.

భారత్ బ్రిటన్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటం చేసిన విధంగానే, వియత్నాం ఫ్రెంచ్, బ్రిటన్, అమెరికన్ సామ్రాజ్యవాదాలకు వ్యతిరేకంగా స్వాతంత్ర్య పోరాటం జరిపింది. అయితే పోరాట మార్గాలు వేరువేరు. వియత్నాంపై టన్నులకొద్దీ నేఫాం బాంబులను అమెరికా ప్రయోగించింది. రెండో ప్రపంచ యుద్ధంలో హిరోషిమా, నాగసాకీలపై వేసిన అణు బాంబులు, వియత్నాంపై ప్రయోగించిన విస్ఫోటనం ముందు లెక్కించవలసింది కాదు. సుమారు 720 అణుబాంబులంతటి శక్తివంతమైన బాంబులను వియత్నాంపై ప్రయోగించింది అమెరికా. మన దేశంలో జరిగిన భోపాల్ ఉదంతం ఏజెంట్ ఆరెంజ్ అనే ప్రాణంతక కెమికల్‌ను 2 గ్రాములు ఉపయోగిస్తే, 524 గ్రాముల కెమికల్‌ను బాంబుల రూపంలో వియత్నాం గడ్డపై వాడారు. ఫలితంగా ఇప్పటికీ కొన్ని వేల కుటుంబాల ఆరోగ్య పరిస్థితి దారుణంగా ఉంది. "కూచి" ప్రాంతంలో వియత్నాంవాసులు జరిపిన యుద్ధం ప్రపంచంలోని స్వాతంత్ర్య పోరాటాలన్నింటికన్నా విశిష్టమైనది. కూచి సొరంగంగా ప్రసిద్ధి చెందిన ప్రాంతంలో సొరంగం మూడంచెలుగా, సుమారు 2 సంవత్సరాలపాటు తవ్వారు. అందులోనే ఉంటూ కొన్ని సంవత్సరాల కాలం వియత్నాం ప్రజలు జరిపిన గెరిల్లా యుద్ధం ప్రపంచ పోలీస్ అయిన అమెరికాను గడగడలాడించింది. 20 లక్షల వియత్నామీయులు ఆకలితో మలమల మాడిపోయారు. అయినా వారు వెనుకంజ వేయలేదు. "అంకుల్ హో" హోచిమిన్ నాయకత్వం, ప్రజల పోరాటపటిమ అంకుల్‌శామ్ అమెరికాను మట్టికరిపించింది. 1969లో చనిపోయేనాటికి, వియత్నాం 1975లో "ఐక్య వియత్నాం" స్వాతంత్ర్యం ప్రకటించేనాటికి, నేటి పరిస్థితులకు చాలా వ్యత్యాసం ఉంది.

యుద్ధంవల్ల వియత్నాంలో గడ్డి మొలవని పరిస్థితి. అయినా ప్రజలు "సోషలిస్ట్ రిపబ్లిక్ వియత్నాం"గా ఏర్పడి నాటి నుండి నేటివరకు చూపిన అకుంఠిత దీక్ష ప్రపంచ దేశాలకు ఆదర్శప్రాయమని భావిస్తున్నాను. వియత్నాం దేశం రెండుగా విడిపోయి ఉండి, ఉత్తర వియత్నాం స్వాతంత్ర్యం పొందిన వెంటనే దక్షిణ వియత్నాంకు లిబరేషన్ ఫోర్స్‌ను పంపి అక్కడి అమెరికన్ మిలిటరీని పారద్రోలి దక్షిణ వియత్నాంను విలీనం చేయడం ఒక మహత్తర ఘట్టంగా భావించవచ్చు. ఇప్పటికీ ఉత్తర, దక్షిణ వియత్నాంల మధ్య మాతృభాషలో, జీవన విధానంలో వ్యత్యాసం ఉంది. అయినప్పటికీ ఒకే దేశంగా ఒకే ప్రజలుగా భావిస్తూ సోషలిస్టు స్ఫూర్తితో జీవించడం గమనార్హం.

సోషలిస్ట్ రష్యా విచ్ఛిన్నం, తర్వాత వచ్చిన పరిణామాలను విశ్లేషించుకుని, సోషలిస్ట్ సమాజ స్థాపన దిశగా ముందుకు వెళుతున్నామని వియత్నాం చెబుతున్నది. ప్రపంచీకరణతో వస్తున్న మార్పులను, అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని, శాస్త్రసాంకేతిక రంగాల్లో పరిశ్రమల స్థాపనలో, టూరిజంలో విశేషమైన అభివృద్ధిని సాధించింది. సెజ్‌లను, విదేశీ పెట్టుబడులు స్వీకరించినప్పటికీ ప్రభుత్వ నియంత్రణలోనే ఉంది. ఒకప్పుడు భారత్‌పై ఆధారపడిన దేశం. నేడు వియత్నాం చూసినట్లయితే, మనం దాన్ని ఆదర్శంగా తీసుకోవాల్సి ఉంది.

ఒకప్పుడు వరి కోసం ఇబ్బంది పడ్డ వియత్నాం, ఇప్పుడు ప్రపంచంలో వరి ఎగుమతిలో రెండో స్థానంలో ఉంది. రబ్బరు, జీడిపప్పు, బంగారు ఆభరణాల తయారీ, మేలిమి ముత్యాల ఉత్పత్తిలోనూ అగ్రభాగాన నిలిచింది. గత 25 సంవత్సరాల కాలంలో వియత్నాం గణనీయమైన అభివృద్ధిని సాధించింది. 1947లో స్వాతంత్ర్యం పొందిన మన తలసరి ఆదాయం సుమారు 35,00 రూపాయలుకాగా వియత్నాం తలసరి ఆదాయం 50,408 రూపాయలు. అయితే వియత్నాంలో కూడా పేద, ధనిక తారతమ్యాలున్నాయని, వీటిని అధిగమించటానికి ప్రయత్నిస్తున్నామని, అందుకు పేదల స్థాయిని, మధ్య తరగతి స్థాయికి పెంచడానికి కృషి చేస్తున్నామని వారు చెబుతున్నారు.

వియత్నాం మహిళలు అందరూ కష్టపడి పనిచేస్తారు. చిరు వ్యాపారాల నుండి కార్పొరేట్ స్థాయిలో గల మాల్స్ వరకు మహిళలే నిర్వహిస్తున్నారు. వారు వియత్నాం విమెన్ యూనియన్ పేరిట సంఘటితమై సెంటర్ ఫర్ ఉమెన్ &

డెవలప్‌మెంట్ పేరిట మహిళలు వ్యాపారాలు నిర్వహిస్తూ, అందులో వచ్చే ఆదాయాన్ని చిన్న పిల్లలు, మహిళాభివృద్ధికి ఖర్చు పెడుతున్నారు. సమాజంలో స్త్రీ, పురుష వివక్ష ఎక్కడా మాకు కనపడలేదు. అర్ధరాత్రి కూడా మహిళలు ఒంటరిగా, స్వేచ్ఛగా తిరగగలుగుతున్నారంటే అక్కడ మహిళలకు ఎంత గౌరవం ఇస్తున్నారో అర్థమవుతుంది.

మహిళల సగటు ఆయుర్దాయం 73 సంవత్సరాలు కాగా పురుషులది 71. ప్రాథమిక విద్య ఉచితం. యుద్ధకాలంలో బాంబులు పడుతున్నప్పటికీ, బంకర్లలోనే 80% ప్రజానీకం ప్రాథమిక విద్యను పూర్తి చేశారంటే వారి దృఢ దీక్ష, అంకితభావం ఎలాంటిదో మనకు అర్థమవుతుంది. నేటి వారి అక్షరాస్యతా శాతం 96% (అక్షరాస్యత అంటే వారి దృష్టిలో వేలు ముద్రలు వేయటం కాదు. ప్రాథమిక విద్యను పూర్తి చేయడం.).

ప్రభుత్వం కల్పిస్తున్న పరిశుభ్రమైన వాతావరణం వారి ఆరోగ్యాలను కాపాడుతున్నది. తాగునీటి బాధ్యత ప్రభుత్వానిదే. పట్టణ, నగరాలలో అండర్ డ్రైనేజీని అభివృద్ధి చేశారు. వాతావరణ కాలుష్యం లేదు. ఆహార, పానీయాల విషయంలో ప్రజలు ప్రత్యేకతను సంతరించుకున్నారు. వారి ఆహారంలో ఎక్కువ భాగం ఉడికించిన కూరగాయలు, ఆకుకూరలు ఉంటాయి. చేపలు, రొయ్యలు ప్రధాన ఆహారం. వారు తినే ఆహారంలో నూనె, క్రొవ్వు, తీపి పదార్థాలు ఉండకపోవడం గమనించాం. ప్రతి ఒక్కరూ వ్యాయామానికి ప్రాధాన్యత ఇస్తారు. చాలా ఎక్కువగా పార్కులు, ఆటలకు చెందిన ఆడిటోరియాలు మనకు కనపడతాయి.

వియత్నాంలో సుమారు 78% బౌద్ధ మతస్తులు. 7.8% క్రిస్టియన్లు, ముస్లింలు తదితర మతస్తులున్నారు. మతాచారాలను పాటించడం వ్యక్తిగతం. ఎవరిష్టం వచ్చిన మతం వారు స్వీకరించవచ్చు. పూజలు చేయడం, పగోడాలు (బౌద్ధారామాలు) దర్శించడం వారి వారి ఇష్టం. దేశవ్యాప్తంగా 80 హిందూ దేవాలయాలు ఉన్నాయట. వివాహానికి మతం అడ్డంకి కాదు. ఏ మతానికి చెందినవారినైనా పెళ్లి చేసుకోవచ్చు. మతపరమైన పండుగలు లేవు. సంవత్సరంలో 8 రోజులు జాతీయ పండుగలు ఉన్నాయి. మహిళలు అక్కడక్కడా ఆధునిక పద్ధతుల్లో వస్త్రాలు ధరించడం చూశాము.

తొమ్మిది కోట్ల జనాభా ఉన్న వియత్నాంలో శాంతి భద్రతల సమస్య మచ్చుకైనా కన్పించలేదు. టెర్రరిస్టు కార్యకలాపాలు లేవు. రోడ్ యాక్సిడెంట్లకు సంబంధించి తప్ప నేరాలు ఉండవట. ఉగ్రవాద, తీవ్రవాద కార్యకలాపాలు మచ్చుకు కూడా కన్పించవు. ఇది పూర్తిగా భద్రత కలిగిన దేశమని అక్కడి మన భారతీయులు చెప్పారు. ఇక్కడ ప్రశాంతమైన జీవనం గడపవచ్చునని, ప్రజలు స్నేహపూర్వకంగానూ,ఇతరులకు సహాయపడటంలో ఉత్సుకతగా ఉంటారని చెప్పారు. 75 లక్షల జనాభా ఉన్న హోచిమిన్ (సైగాన్)లోనే 45.5 లక్షల చిన్నస్థాయి మోటార్ బైక్స్ ఉన్నాయి. ట్రాఫిక్ సిగ్నల్స్ దగ్గర పోలీసులు కనపడరు. ప్రజల్లో స్వయం క్రమశిక్షణ అడుగడుగునా కనపడుతుంది. రోడ్లపైన మనకు పోలీసులు కనపడటం అరుదు.



మా పర్యటనలో భాగంగా 19-9-2011 ఉదయం జరిగిన ఇండో-వియత్నాం పీపుల్స్ ఫెస్టివల్ ప్రారంభ కార్యక్రమం అద్భుతంగా జరిగింది. వియత్నాం వైస్ ప్రెసిడెంట్, మిత్రులు హాజరైనప్పటికీ వాళ్ల వచ్చినప్పుడు గాని వెళ్లినప్పుడు గాని, సెక్యూరిటీ లేదా

పోలీసులను మేము చూడలేదు. మన దేశ అంబాసిడర్‌ను కలిసినప్పుడు కూడా ఏ రకమైన సెక్యూరిటీ మేం గమనించలేదు. అత్యున్నత స్థాయిలో ఉన్నవాళ్లు కూడా సాధారణ ప్రజలతో కలిసి తిరగటం అసాధారణమైన విషయం. ఎక్కడా వి.ఐ.పి. అనే ప్రకటన గానీ, లేదా ప్రత్యేకత ప్రదర్శించడం గాని చూడలేదు. మేము హాజరైన సమావేశాలన్నింటిలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో మన దేశ కళాకారులు ప్రీతీ నిగమ్, హరిదాసు జయలక్ష్మి, సాయి లహరి, గాయకుడు మున్నా కాశీ, కేరళ నుండి వచ్చిన గాయకుడు వి.టి.మురళి అద్భుతమైన ప్రదర్శన ఇచ్చారు. వియత్నాం కళాకారులు వాళ్ల దేశ సంస్కృతిని ప్రదర్శిస్తూ ఇచ్చిన కళా ప్రదర్శనలు మన భాష అర్థంకానప్పటికీ మన మనస్సుకు హత్తుకుపోతాయి. ఒక కళాకారుడు తన ముక్కుతో ఫ్లూట్ ఊదటం, ఒక మోటారు సైకిల్ సైలెన్సర్‌ను సంగీత సాధనగా మలిచి వాయించిన సంగీతం అద్భుతం.

మా పర్యటనలో భారత్ రాయబారిని హనోయ్ సిటీలో కలిశాము. భారతీయులు నిర్వహించిన "ఇండియా డే" కార్యక్రమంలో పాల్గొన్నాము. అయినప్పటికీ వియత్నాంలో ఇప్పటికీ, నివాస గృహ కల్పన చాలా కష్టంగా ఉన్నదని తెలిసింది. దీనికి కారణం పట్టణీకరణ. గ్రామాల నుండి వేల సంఖ్యలో పట్టణాలకు వలస వస్తున్నవారికి గృహ కల్పన ఒక సమస్యగా మారింది. ఈ సమస్యను అధిగమించడానికి ప్రయత్నిస్తున్నామన్నారు. ప్రైవేటు ఆస్తులు ఇప్పటికీ ఉన్నాయి. సహకార వ్యవసాయం అమల్లో ఉంది. భూమి కౌలు హక్కులను ప్రభుత్వం కల్పిస్తుంది. ఏదేమైనప్పటికీ ఎన్ని ఒడుదుడుకులు ఎదురౌతున్నా, సోషలిస్టు పంథాలో తమ దేశాన్ని అభివృద్ధి చేసుకుంటూ తమ ప్రజలను దేశాభిమానులుగా మల్చుకోవడంలో వియత్నాం సఫలమైందని మనకు అర్థమవుతుంది.

మా పర్యటనలో కాంగ్రెస్, ఎన్.సి.పి.ఐ, సి.పి.ఐ., సి.పి.ఐ.ఎం, పార్టీల ప్రతినిధులుగా ఉండి వివిధ రంగాలకు ప్రాతినిధ్యం వహించటం జరిగింది. ఈ పర్యటన ముగింపులో ప్రతినిధులందరూ వియత్నాం పర్యటన తమ జీవితంలో మర్చిపోలేని మధురానుభూతి అని, పోరాటాల గడ్డపై తమ జీ[illegible] అమూల్యమైన సంఘటన అనే ఏకాభిప్రాయానికి వచ్చారు. అందుకే విය[illegible] అభివృద్ధికి దిక్సూచి అని భావిస్తున్నాము. సోషలిస్టు వ్యవస్థను కాపాడుకోవడానికి, ఆర్థికంగా అభివృద్ధిని సాధిస్తున్న వియత్నాం అనుసరిస్తున్న పంథాను ఇతర సోషలిస్టు దేశాలు, వివిధ దేశాల కమ్యూనిస్టు పార్టీలు ఆదర్శంగా తీసుకోవాలని భావిస్తున్నాను. ఆల్ ఇండియా పీస్ & సాలిడారిటీ సంస్థ ఆధ్వర్యంలో జరిపిన ఈ పర్యటన వియత్నాం మరియు భారతదేశాల మధ్య స్నేహ సంబంధాలను పెంపొందించే దిశగా తోడ్పడుతుందని భావిస్తున్నాము.

(18-9-2011 నుండి 24-9-2011 వరకు వియత్నాం ప్రభుత్వ ఆహ్వానం మేరకు నాలుగో వియత్నాం-ఇండియా పీపుల్స్ ఫ్రెండ్స్ ఫెస్టివల్‌లో పాల్గొన్న సందర్భంగా ఈ వ్యాసం.

రచయిత ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఎ.ఐ.ఎల్.యు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ ప్రధాన కార్యదర్శి)

అట్టమీది కథ



ప్రాచీన దేశంలో పోరాట జ్వాలలు

- బి అమరనారాయణ

"దిగజారిపోయే ఈజిప్టు మహిమ/ పతనమైపోయే గ్రీస్ గొప్పతనం/ పడిపోయే ట్రాయ్ పట్టణం/ నేలకొరిగే రోమ్ కిరీటం/ అణిగింది చూడు వెనిస్ గర్వం/ కానీ.../ అక్కడి ప్రజలు కన్న కలలు../పెంచుకున్న ఆశలు../ ఆకాంక్షలు../కలలుగానే మిగిలి వున్నవలాగే.

రాచరికాలు పతనమై క్రమేపీ పౌర ప్రభుత్వాలు ఏర్పడుతున్న సమయంలో పసిద్ధ ఆంగ్ల కవి, నాటకకర్త మేరీ ఎలిజబెత్ కోలరిడ్జ్ రాసిన ఈ గేయం ప్రస్తుత పరిణామాలకూ సరిగ్గా సరిపోతుంది. కాకపోతే ఇప్పుడు కూలుతున్నది రాచరిక కోటలు కాదు. పెట్టుబడి పేక మేడలు. సామ్రాజ్యవాద ఆర్థిక నమూనాల నీటి బుడగలు. నాడూ..నేడూ కూడా ప్రజల ఆకాంక్షలు మాత్రం నెరవేరలేదు. ఈజిప్టులో హోస్నీ ముబారక్‌ను ప్రజలు దించేసినా..అక్కడి జనం ఆశలు అలానే ఉన్నాయి. గ్రీస్‌లో ప్రభుత్వం కూలలేదు కానీ దేశం రుణ సంక్షోభంలో కూరుకుపోయింది. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం ఆకాశానికి ఎగబాకుతున్నాయి. ప్రజలపై పెను భారాలు పిడుగుల్లా పడుతున్నాయి. ఆ భారాలను భరించలేని జనం ఆగ్రహావేదనలతో ప్రతిఘటనలకు దిగుతున్నారు. ప్రాచీన ప్రజాస్వామ్యానికి మాతృదేశంగా చెప్పబడే గ్రీస్ ప్రజలకు ఈ దురవస్థ ఎందుకొచ్చింది? చారిత్రికంగా సాంస్కృతిక, కళా సారస్వత రంగాలకు కాణాచిగా నిలిచిన ఆ దేశం ఇప్పుడెందుకు మునిగిపోతోంది? ఈ పూర్వాపరాల పరామర్శే ఈ వారం అట్టమీది కథ..

దీనికి ముందు కాస్త గ్రీసు చరిత్రలోకి వెళ్దాం. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత గ్రీస్‌లో ఆర్థిక, సామాజిక మార్పులు వేగం పుంజుకున్నాయి. పర్యాటక, నౌకాయాన రంగాల్లోకి ప్రధాన ఆర్థిక వనరులు, భారీగా పెట్టుబడులు తరలిరావడంతో అభివృద్ధి వూపందుకుంది. 1991 ప్రాంతంలో మనదేశంలో లాగే అక్కడా సంస్కరణలకు తలుపులు బార్లా తెరిచేశారు. వృద్ధి రేటు వేగం చూపించి ఊదర గొట్టారు. దేశీయ స్థూల ఉత్పత్తి కొన్నేళ్లపాటు సాలుసరి మూడు శాతం చొప్పున ఎగబాకింది. పెద్ద ఎత్తున సంపద పెరుగుదల నమోదైంది. అయితే ఇదంతా ఒక వైపే. ధనవంతులు, బ్యాంకర్లు, పారిశ్రామికవేత్తలు, ఓడల యజమానులు, ఇతర పెట్టుబడిదారీ వర్గాలకు మాత్రమే సొంతమైంది. కార్మికవర్గం, అణగారిన ప్రజలకు ఈ 'అభివృద్ధి' ఫలాలు అందని మావిపళ్లే అయ్యాయి. వారంతా తీవ్ర ఇక్కట్లను ఎదుర్కొన్నారు.

2000 ఆఖరిలో ముంచుకొచ్చిన ఆర్థిక సంక్షోభం గ్రీస్‌ను తీవ్రంగా దెబ్బతీసింది. ప్రభుత్వ ధనాన్ని పాలకులు విపరీతంగా వృధా చేయడం, సంపన్నులచే పన్ను ఎగవేత, ఆపైన అంతర్జాతీయంగా అప్పు పుట్టకపోవడం దేశాన్ని సంక్షోభం ఊబిలో మరింతగా కూరుకుపోయేలా చేశాయి. అలాగే రుణభారం పెనుశాపంగా పరిణమించింది. 2010 వసంతం గ్రీస్ పాలిట కారుమబ్బుల కాలమై కూర్చుంది. తీసుకున్న రుణాలు తిరిగి చెల్లించలేక దివాళా తీయడం తప్పదన్న దుర్భర స్థితి దాపురించింది. అక్కడి ఉద్యమాల సెగ తమకెక్కడ తగుల్తుందోనని తోటి యూరోపియన్ దేశాలు 145 బిలియన్ల డాలర్ల ఆర్థిక సాయాన్ని ప్రకటించాయి. కుప్పకూలుతున్న గ్రీస్ ఆర్థిక వ్యవస్థకు కాస్త వూతమిచ్చాయి. అయితే ఈ రుణాల మంజూరుకు విధించిన షరతులే ప్రజలను గుల్ల చేశాయి. ప్రజోపయోగ సంక్షేమ కార్యక్రమాలపై విధిగా కోతలు విధించి, సాధారణ ప్రజల నుండి అధిక పన్నులు గుంజాలన్నది వాటిలో ప్రధాన షరతు. ఇది దీర్ఘకాలిక సామాజిక అశాంతికి దారితీసింది. యూరోజోన్‌ను అస్థిర పర్చేందుకు దారి తీసింది. యువత భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది. అయితే ఇంత దుర్భర పరిస్థితిలోనూ యూరోపియన్ యూనియన్ పెట్టుబడిదారులకు లాభాలు కురిపించే మార్గాలనే సంక్షోభానికి ప్రత్యామ్నాయ మార్గాలుగా చూపుతూ తనవైన వ్యూహాత్మక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా కార్మికుల వేతనాలను, పించన్లను తెగకోయడం, ఉద్యోగాల నుంచి తొలగించి ఉపాధికి ఎసరు పెట్టడం, సామాజిక భద్రతను, సామాజిక హక్కులను

హరించివేయడం వంటి వాటిలో ఇయు మరింత ప్రత్యేక పాత్ర పోషించింది. ఈ పోకడలు 2007 బడ్జెట్ కేటాయింపులలోనే భారీ ఎత్తున ప్రతిబింబించాయి. వైద్యం తదితర కీలక రంగాలకు భారీ కోతలు విధించారు. మరోవైపున గత ప్రభుత్వ హయాం నుంచి పెద్ద ఎత్తున ప్రయివేటీకరణ జరుగుతోంది. మాస్ట్రిచ్ ఒప్పందం, ఆర్థిక మరియు ద్రవ్య యూనియన్ (ఇఎంయు), అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) సంస్థ, లిస్బన్ ఒడంబడికలు ఈ క్రమంలో తీసుకొచ్చినవే. ఐరోపాలోని బడా పెట్టుబడిదారులు మరింతగా బలపడేందుకు, పెద్ద మొత్తంలో లాభాలు గడించే ఎత్తుగడలతో వీటిని తయారు చేశారు.

అలెగ్జాండర్

వాస్తవానికి అమెరికా, యూరోపియన్ యూనియన్‌లోని ఇతర దేశాల్లోనూ ఆర్థిక సంక్షోభాలకు పెట్టుబడిదారుల మితిమీరిన లాభార్జనా దాహమే మౌలిక కారణం. సంపదంతా గుత్త పెట్టుబడిదారుల చేతిలో కేంద్రీకృతమైపోతోంది. రుణ సంక్షోభం మూలంగా గ్రీస్ స్థూల దేశీయోత్పత్తి 2009 నుంచి ప్రతి సంవత్సరం ఐదు శాతం చొప్పున తగ్గుతూ వస్తోంది. 2012లో ఇది మరింతగా పడిపోయే ప్రమాదం ఉందని భావిస్తున్నారు. ఇక్కడ ముఖ్యమైన విషయమేమంటే ప్రజల్లో ఏ ఒక్కరూ కూడా ఈ రుణ సంక్షోభానికి కారణంకాకున్నా సంక్షోభ ప్రభావమంతా వారిపైనే పడుతోంది. ఈ సంక్షోభం ప్రస్తుతం ఐర్లండ్, పోర్చుగల్, ఇటలీ, స్పెయిన్‌కు విస్తరించి జర్మనీలో గుబులు రేపి యూరోపియన్ యూనియన్‌ను ఓ కుదుపు కుదిపేసింది. యావత్ ప్రపంచం స్టాక్‌మార్కెట్ల సూచీల వైపు బిత్తర చూపులు చూసేలా చేసింది.

ఉద్దీపనలు..విష గుళికలు

గ్రీసు రుణ సంక్షోభంలో కూరుకుపోగానే యూరప్ యూనియన్ గగ్గోలు పెట్టింది. ఉమ్మడి కరెన్సీ ఉండటంతో యూరో స్టాకు సూచీలన్నీ నేల చూపులు చూశాయి. దీంతో ఒకవైపు ఉద్దీపనలు ప్రకటిస్తూ మరోవైపు పొదుపు చర్యలు తీసుకోవాలంటూ గ్రీసుపై ఒత్తిడి చేస్తూ ప్రజలపై పెను భారాల మోపే విషగుళికల లాంటి షరతులు విధించాయి. ఈ క్రమం..2010 ఏప్రిల్-మే నెలల్లో గ్రీసు ఇక దివాళా తీస్తుందన్న భయాందోళనలు వెల్లువెత్తాయి. దీంతో యూరో జోన్ దేశాలు 145 బిలియన్ డాలర్ల సహాయక ప్యాకేజికి ఆమోదం తెలిపాయి. గ్రీసు ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఉద్దీపన ఒప్పందం ప్రకారం ఈ ప్యాకేజి ప్రకటించాయి. ఈ షరతుల్లో భాగంగా మరిన్ని కఠిన పొదుపు చర్యలు తీసుకోనున్నట్లు ప్రధాని ప్రకటించారు. దానిపై కార్మిక సంఘాలు సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చాయి. కాగా మరోవైపు ఇదే సంవత్సరం ఆగస్టులో ఇయు, ఐఎంఎఫ్ నుంచి రెండో విడత ఉద్దీపన ప్యాకేజి పొందాలంటే గ్రీసు మరిన్ని పొదుపు చర్యలు తీసుకోవాల్సిందేనంటూ షరతులు తీసుకొచ్చాయి. అక్టోబర్‌లో ప్రభుత్వం మరిన్ని కఠిన పొదుపు చర్యలు ప్రకటించింది. వ్యాట్ ను భారీగా పెంచేశారు. దాంతో పాటు జనంపై కొత్త పన్నులను బాదారు. నవంబర్‌లో మూడో విడత ఆర్థిక సహాయాన్ని ఇయు, ఐఎంఎఫ్ ప్రకటించాయి. ఇది చాలదన్నట్లు 2011 ఫిబ్రవరిలో ఇప్పటి వరకు తీసుకున్న చర్యలు ఏమాత్రం సరిపోవని, తన ఆర్థిక వ్యవస్థ తిరిగి పట్టాలకెక్కాలంటే సంస్కరణలను వేగవంతం చేయాలని సామ్రాజ్యవాద దేశాల నాయకులు గ్రీస్‌ను హెచ్చరించారు. దీంతో జనంపై భారాలు మరింత అధికమయ్యాయి. భరించలేని ప్రజలు రోడ్డు ఎక్కారు. ఈ ఏడాది జూన్‌లో 24 గంటల పాటు సాధారణ సమ్మె చేపట్టారు. ప్రభుత్వ నూతన పొదుపు చర్యల ఆమోదాన్ని అడ్డుకునేందుకు లక్షలాది మంది ప్రజలు పార్లమెంటు ముట్టడించేందుకు ప్రదర్శన చేశారు. గత జూన్‌లో 109 బిలియన్ యూరోల ఉద్దీపన ప్యాకేజిని ఐరోపా ఆర్థిక స్థిరత్వ సౌకర్య పథకం కింద (యూరోపియన్ ఫినాన్షియల్ స్టెబిలిటి ఫెసిలిటి) అందించేందుకు యూరోపియన్ యూనియన్ నాయకులు అంగీకరించారు. ఇదే సమయంలో మూడు ప్రధాన రుణ రేటింగ్ సంస్థలూ గ్రీసు రుణార్హత రేటింగ్‌ను బాగా తగ్గించి 'దివాళాకు చేరువులో ఉన్న' అని సూచించే రేటింగ్‌ను ఇచ్చాయి. 2011 ఆగస్టులో గ్రీసుకు రెండో బెయిల్ అవుట్ అందించేందుకు జులై 21 న చేసుకున్న ఒప్పందాన్ని అమల్జేయాలని యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్ అధ్యక్షుడు జీన్ క్లాడీ ట్రిచెట్ కోరారు. గత సెప్టెంబర్‌లో మూడిస్ అనే రుణ రేటింగ్ సంస్థ ఎనిమిది గ్రీకు దేశాల క్రెడిట్ ర్యాంకును తగ్గించింది. ఒడ్జెట్ లోటును పూడ్చుకునేందుకు ప్రభుత్వం మరో ప్రజా వ్యతిరేక నిర్ణయాన్ని తీసుకుంది. కొత్త ఆదాయ పన్ను విధానాన్ని తీసుకొచ్చింది. ఇంత జరుగుతున్నా..గ్రీసు ఇప్పటికీ యూరో జోన్‌లో కొనసాగుతుందని జర్మనీ ఛాన్సలర్ ఏంజిలా మెర్కెల్; ఫ్రెంచ్ అధ్యక్షులు సర్కోజీ, యూరోపియన్ కమిషన్ అధిపతి జోస్ మాన్యల్ ప్రకటించారు.

ప్రభుత్వం

కార్యనిర్వహణాధికారిగా గ్రీస్ దేశాధ్యక్షునికి లాంఛనప్రాయమైన అధికారాలు ఉంటాయి. పాన్ హెల్లినిక్ సోషలిస్టు మూవ్‌మెంట్ (పిఎఎస్ఒకె-పాసోక్) పార్టీ సీనియర్ నాయకులు కరోలస్ పపోలీస్ ప్రస్తుత దేశాధ్యక్షునిగా ఉన్నారు. 1929లో జన్మించిన కరోలస్ అధ్యక్షపదవి చేపట్టకముందు విదేశాంగ మంత్రిగా పని చేశారు. 2005 మార్చి 12 అధికారం చేపట్టిన ఆయన 2010లో మళ్లీ అధ్యక్షునిగా ఎన్నికై కొనసాగుతున్నారు. ప్రభుత్వ అధినేతగా ప్రధానమంత్రి వ్యవహరిస్తారు. 300 సభ్యులు గల పార్లమెంటుకు ఆయన బాధ్యత వహిస్తారు. ప్రస్తుతం జార్జి పాపంద్రూ ప్రధానిగా ఉన్నారు. గ్రీస్‌లో అత్యంత శక్తివంతమైన రాజకీయ వారసత్వమున్న కుటుంబానికి చెందిన జార్జి పాపంద్రూ 2004 నుంచి పాసోక్ పార్టీ అధ్యక్షునిగా కూడా ఉన్నారు. 2007లో పార్టీ ఓటమి పాలైనప్పుడు ఈయననే నాయకత్వంలో ఉంది. మళ్లీ ఆయన నాయకత్వంలోనే 2009లో పాసోక్ ఘనవిజయం సాధించింది. ఆర్థిక సంస్కరణలకు, హరిత విధానాల ప్రోత్సాహానికి, ప్రజా జీవితంలో అవినీతిపై పోరాడటంలోనూ పాపంద్రూ ముందుంటారని చెబుతారు. ఆర్థిక, వాణిజ్య సంక్షోభ విపత్తు చుట్టుముట్టి దేశమంతా విస్తరించినప్పుడు పాపంద్రూకు పెను సవాల్ ఎదురైంది. 2009 డిసెంబర్ నుంచి బడ్జెట్ లోటు తగ్గించుకోవాలంటూ మార్కెట్ వర్గాల నుంచి ఆయనపై తీవ్ర ఒత్తిడి మొదలైంది. దీంతో అనేకమార్లు కోతలకు ఆయన పదునుపెట్టాడు. ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు కోసేశారు. ఇంధన ధరలను చుక్కలంటించారు. కాకపోతే పన్నుల ఎగవేత చర్యలకు మాత్రం అడ్డుపడ్డారు. అయినా సంక్షోభ ఊబి నుంచి బయటపడలేకపోయారు. 2010 వసంతానికి కల్లా ఏమాత్రం రుణాలు చెల్లించలేని దీనస్థితిలోకి దేశం నెట్టివేయబడింది. యూరోజోన్ లోని ప్రభుత్వాలతో చర్చలు జరిపి, ప్రధానంగా జర్మనీతో చర్చల అనంతరం మరోమారు కోతల చర్యలకు పాపంద్రూ తెర లేపారు. ఈ సారి అవి మరింత కఠినంగా ఉన్నాయి. పెన్షన్లు, జీతాల్లో భారీ కోతలు విధించారు. ఇవన్నీ కూడ చాలడం లేదు. దీంతో 2011 ఆకురాల్చే కాలంలో మరోమారు ఉద్దీపన ప్రకటించేందుకు యూరోపియన్ యూనియన్ దేశాలు సంకేతాలిచ్చాయి. పాపంద్రూ గతంలో 1988-89లో జాతీయ [illegible] మంత్రిగాను, 1994-96లో మత వ్యవహారాల మంత్రిగాను బాధ్యతలు నిర్వహించారు. 1990-2004లో



గ్రీసు వివరాలు ...

పూర్తి పేరు : హెలినిక్ రిపబ్లిక్
జనాభా : 1.12 కోట్లు (ఐరాస 2010)
రాజధాని : ఏథెన్స్
విస్తీర్ణం : 131,957 చకిమీ
ప్రధాన భాష : గ్రీక్
ప్రధాన మతం : క్రైస్తవం
ఆయుప్రమాణం : 78 సంవత్సరాలు (పురుషులు), 83 సంవత్సరాలు (స్త్రీలు)
ద్రవ్య మారకం : యూరో (1 యూరో క్మ 100 సెంట్లు)
ప్రధాన ఎగుమతులు : జౌళి ఉత్పత్తులు, దుస్తులు, ఆహారం, చమురు ఉత్పత్తులు
తలసరి జిఎన్ఐ : 28,630 డాలర్లు (ప్రపంచబ్యాంకు 2009)
ఇంటర్నెట్ డొమైన్ : జిఆర్
అంతర్జాతీయ డయల్ కోడ్ : +30



విదేశాంగ వ్యవహారాల మంత్రిగా చేశారు. పాపంద్రూ తాత జార్జ్ పాపంద్రూ సీనియర్, నాన్న ఆంద్ర్యూస్ పాపంద్రూ కూడా గ్రీస్ ప్రధానమంత్రులుగా పనిచేశారు. 2006లో సోషలిస్ట్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యారు. అలానే గ్రీస్ 182 ప్రధానిగా ఆయన అక్టోబర్ 9, 2009లో బాధ్యతలు చేపట్టారు. సీనియర్ పాపంద్రూ 1944-45, 1963, 1964-65 మధ్యకాలంలో ప్రధానిగా మూడు సార్లు ఎన్నికయ్యారు) అలానే ఆంద్ర్యూస్ రెండు పర్యాయాలు (1981 - 89లోనూ, 1993-1996 మధ్యకాలంలో) చేశారు.

గ్రీసు చారిత్రిక భౌగోళిక విశేషాలు

గ్రీసు అనేది గ్రేసియా అనే లాటిన్ పదం నుంచి ఉద్భవించింది. గ్రేసియా అంటే గ్రీకుల భూమి అని అర్థం. గ్రీసును గ్రీకులు హెల్లాస్ లేదా ఎల్లాద కూడా పిలుస్తారు. హెల్లాస్ అని ఇంగ్లీషులో కూడా కొన్ని సార్లు వినియోగిస్తారు. ఇది దక్షిణ యూరప్‌లో ఉంది. హెలెనిక్ రిపబ్లిక్ అనేది ఈ దేశానికున్న అధికారిక నామం. గ్రీసు రాజధాని ఏథెన్స్. దేశంలో అతిపెద్ద నగరం కూడా ఇదే. ఉత్తరాన అల్బేనియా, రిపబ్లిక్ ఆఫ్ మాసిడోనియా, బల్గేరియా దేశాలు, తూర్పున టర్కీ సరిహద్దు దేశాలు. గ్రీసు ప్రధాన భూభాగానికి తూర్పు వైపున ఏజియన్ సముద్రం ఉంది. పశ్చిమాన అయోనియన్ సముద్రం ఉండగా, దక్షిణాన మధ్యధరా సముద్రముంది. ప్రపంచంలో అత్యధిక తీరప్రాంతమున్న దేశాల్లో గ్రీసుది 12వ స్థానం. దీని తీరప్రాంత పొడవు 13,676 కిలోమీటర్లు. ఇది మధ్యధరా సముద్రంలో క్రమాకారం లేని ద్వీపకల్పంగా ఉండి, దానికి చాలిడైస్, పెలోపొన్నిస్ అనే రెండు పెద్ద ద్వీపకల్పాలు అదనంగా పొడుచుకొచ్చినట్లుగా ఉంటుంది. గ్రీకు దీవులను వాటి స్థానాల్ని బట్టి రెండు సమూహాలుగా విభజించారు. అవి : 1) అయోనియన్ దీవులు 2) ఏజియన్ దీవులు. గ్రీస్ ప్రధాన భూభాగానికి పశ్చిమంగా అయోనియన్ దీవులుంటాయి. వీటిలో కోర్ఫు, సెఫలోనియా, ల్యూకాస్ దీవులు కలిసి వుంటాయి. ఏజియన్ దీవులు తూర్పు దక్షిణ దిక్కుల్లో ఉంటాయి. యబాయియా, సమోస్, చియోస్, లెస్బాస్, క్రెటే దీవులు కూడా ఏజియన్ దీవుల్లోనే కలిసి ఉంటాయి. దాదాపు 1400 దీవులు గ్రీస్ చుట్టూ వున్నాయి. వీటిలో జనావాసాలున్నవి 227. కాగా ఉత్తర మధ్య గ్రీస్, ఎపిరస్, పశ్చిమ మాసిడోనియా ప్రాంతాలు పర్వతాలతో కూడి ఉంటాయి. దాదాపు 80 శాతం గ్రీసు దేశం పర్వతమయమైవుంటుంది. పిండస్ పర్వతాల ప్రధాన శ్రేణి వాయువ్య గ్రీస్ నుంచి పెలోప్పొన్నెస్ ద్వీపకల్పం వరకు విస్తరించాయి. గ్రీసు దేశంలోకెల్లా అతి ఎత్తైన శిఖరం ఒలింపస్. ఇది సముద్ర మట్టానికి 2,917 మీటర్ల (9,570 అడుగుల) ఎత్తులో ఉంటుంది.

గ్రీసు దేశానికి వైభవోపేతమైన ప్రాచీన నాగరికత వారసత్వముంది. పశ్చిమ నాగరికతకు గ్రీసునే కేంద్రబిందువుగా పరిగణిస్తారు. ప్రజాస్వామ్యం, పశ్చిమ తత్వశాస్త్రం, ఒలింపిక్ క్రీడలు, పశ్చిమ సాహిత్యం, చారిత్రక, రాజనీతి శాస్త్రాలకు గ్రీసు పుట్టినిల్లు. అలాగే ప్రధాన శాస్త్రీయ, గణిత సిద్ధాంతాలు, విశ్వవిద్యాలయ విద్య, నాణేలు, విషాద, వినోద పశ్చిమ నాటకాలకు కూడా గ్రీసు దేశమే మూలస్థావరంగా చెబుతారు. గ్రీసులో 17 ప్రదేశాలను ప్రపంచ వారసత్వ క్షేత్రాలుగా యునెస్కో గుర్తించింది. అలనాటి చారిత్రక, సాంస్కృతిక, సారస్వత వైభవం పాక్షికంగానైనా ప్రతిబింబిస్తూ ఇప్పటికీ అబ్బురపరుస్తుంటుంది. ఆ దేశం అత్యధిక ప్రపంచ వారసత్వ క్షేత్రాలున్న దేశంగా గ్రీసు యూరప్‌లో ఏడవ స్థానం ఆక్రమించగా.. ప్రపంచంలో 13వ స్థానంలో ఉంది. 1830లో ఆధునిక గ్రీసు ఏర్పాటయ్యింది. ప్రస్తుత సంక్షోభాన్ని పక్కనపెడితే వేగవంతంగా అభివృద్ధి చెందిన దేశాల్లో గ్రీస్ ఒకటి. యూరోపియన్ యూనియన్‌లో 1981 నుంచి గ్రీస్ సభ్యదేశం. అలానే 2001 నుంచి ఉమ్మడి కరెన్సీ దేశాల కూటమైన యూరోజోన్‌లో భాగస్వామి. 1952 నుంచి నాటో సభ్యదేశం. ఐరోపా అంతరిక్ష సంస్థ (యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ)లో 2005 నుంచి సభ్యురాలిగా ఉంది. ఐక్యరాజ్యసమితి, ఆర్థిక సహకార మరియు అభివృద్ధి సంస్థ, నల్ల సముద్ర ఆర్థిక సహకార సంస్థల్లో వ్యవస్థాపక సభ్యదేశంగా గ్రీస్ కొనసాగుతోంది.

ఇదీ చరిత్ర

పురాతన రాతి యుగానికి ముందు అట్టికా చుట్టుపక్కల ప్రాంతాల్లో ఆవాసాలున్నా.. పురాతన శాస్త్ర ఆధారాల ప్రకారం..కొత్త రాతియుగకాలం అక్రోపాలిస్ పర్వతాలు, క్లెప్సిద్రా ప్రాంతాల్లోని గుహల చుట్టూ జనసంచారం వున్నట్టు తెలుస్తోంది. యూరప్‌లో మొట్టమొదట నాగరికత అభివృద్ధి చెందిన ప్రాంతం గ్రీసే. మొదట్లో ఏజియన్ సముద్రంలో సైక్లాడిక్ నాగరికతతో ప్రారంభమై క్రీట్‌లోని మినోయాన్ నాగరికత, ప్రధానభూభాగం (మైయిన్‌ల్యాండ్)లోని మైసీనియన్ నాగరికత ప్రారంభమైంది. మైసీనియన్ల తో అనేక ఇండో యూరోపియన్ తెగలకు చెందిన ప్రజలు క్రీస్తుపూర్వం 2000 నాటికి గ్రీస్‌లో ప్రవేశించి అత్యున్నత స్థాయి నాగరికతలను అభివృద్ధి చేశారు. అది అనేక గ్రీకు రాజ్యాలు, నగర రాజ్యాలు... గ్రీక్ ద్వీపకల్పమంతా వ్యాపించి నల్ల సముద్రం తీరానికి, దక్షిణ ఇటలీకి, ఆసియా మైనర్‌కు, నాగరికత విస్తరించింది. శాస్త్రీయ సంగీతం, అద్భుతమైన గృహనిర్మాణ శైలి, నాటకం, సైన్స్, తత్వశాస్త్రం అక్కడ అభివృద్ధి చెందాయి. ఏథెన్స్‌లో ప్రజాస్వామ్య వాతావరణం ఉండటంతో ఒక గొప్ప సాంస్కృతిక వాతావరణం వెల్లివిరిసింది. క్రీస్తుపూర్వం 1200 ప్రాంతంలో ఇండోయూరోపియన్ జాతికి చెందిన డోరియన్ తెగ ప్రజలు గ్రీస్ ప్రాంతాన్ని ఆక్రమించడంతో ప్రారంభమైన అంధయుగ వర్ణనలు మనకు మహాకవి హోమర్ కావ్యాల ద్వారా తెలుస్తాయి. క్రీస్తు పూర్వం 750 నాటికి చరిత్ర ప్రసిద్ధి చెందిన నగర రాజ్యాలు ఏర్పడి విశ్వవిఖ్యాత గాంచిన గ్రీకుల

స్వర్ణయుగానికి నాంది పలికింది. ఈ నగరాల రాజ్యాలు సముద్ర మార్గాల ద్వారా విదేశీ వ్యాపారం జరపడంతో కళలు, సారస్వతం, రాజకీయాలు, తత్వశాస్త్ర అధ్యయనం విస్తరించాయి. క్రీస్తుపూర్వం 5 వ శతాబ్దం నాటికి గ్రీస్ అత్యున్నతమైన వైభవ శిఖరాల్ని అందుకుంది. పెలెపోన్నేసియన్ యుద్ధం (క్రీస్తుపూర్వం 431-404) దానిని బలహీనపర్చింది. వరుస యుద్ధాల ద్వారా పర్షియన్ సామ్రాజ్యాన్ని తిప్పికొట్టేందుకు ఏథెన్స్, స్పార్టా నేతృత్వం వహించాయి. ఈ యుద్ధంలో తమకు తాముగా గ్రీకులుగా పిలుచుకునే మాసిడోనియాకు చెందిన ఫిలిప్-2, ఆయన తనయుడు అలెగ్జాండర్ విజయం సాధించారు. క్రీస్తుపూర్వం 2వ శతాబ్దం నాటికి గ్రీస్ రోమన్ సామ్రాజ్యంలో ఒక సామంత స్థాయికి కుదించుకుపోయింది. క్రీస్తుపూర్వం 146లో గ్రీకుదేశాల్లో రోమన్ రాజ్యం ఏర్పడిన రెండు శతాబ్దాలు గడిచిన తర్వాతనే హెలిస్టిక్ యుగం పాక్షికంగా మొదలైంది. అలెగ్జాండర్ స్థాపించిన అలెగ్జాండ్రియా, ఆటియోచ్, సెల్యూసియాతో పాటు ఆసియా, ఆఫ్రికాలోని ఇంకా అనేకమైన కొత్త హెలిస్టిక్ పట్టణాలకు చాలా మంది గ్రీకులు వలసలు వెళ్లారు. దీంతో రోమన్, హెలిస్టిక్ సాంస్కృతికంగా మిళితమైపోయి బైజాంటైన్ సామ్రాజ్యం అనే సరికొత్త రాజ్యం క్రీస్తు శకం 330లో కాన్‌స్టాంటినోపుల్‌లో స్థాపితమైంది. తర్వాతి 1123 సంవత్సరాల వరకు బైజాంటైన్ సామ్రాజ్యం సుసంపన్నమైన సైనికబలంతో, సాంస్కృతిక వైభవంతో విరాజిల్లింది. కీస్తుశకం 1204లో కాన్‌స్టాంటినోపుల్ మతయుద్ధ యోధుల హస్తగత మయ్యేవరకు గ్రీస్ తూర్పు రోమన్ సామ్రాజ్యంలోనే భాగంగా ఉండేది. క్రీస్తుశకం 1453లో ఒట్టోమాన్ టుర్కీస్ చేతిలో కాన్‌స్టాంటినోపుల్ పతనమయ్యేవరకు బైజాంటైన్ సామ్రాజ్యం కొనసాగింది. ఒట్టోమాన్ పాలన చేపట్టిన తర్వాత గ్రీకు మేధావులు ఇటలీ తదితర ఒట్టోమాన్ పరిపాలనలోని ప్రాంతాలకు వలస వెళ్లారు. పశ్చిమ యూరప్‌కు ప్రాచీన గ్రీకు శిల్పకళకు పునరుజ్జీవింపజేయడంలో వీరు కీలక పాత్ర పోషించారు. క్రీస్తుశకం 1460లో గ్రీస్, ఆర్తడాక్స్ చర్చి ప్రాబల్యమున్నప్పటికీ టర్కీస్ సామ్రాజ్యంలో ఒక రాష్ట్రమైంది. గ్రీసు మహాకవి లార్డ్‌బైరన్ ద్వారా గ్రీస్ తిరుగుబాటు 1821లో చాలా ప్రసిద్ధి పొందగా 1827లో గ్రీస్ స్వాతంత్ర్యం పొందింది. టర్కీకి వ్యతిరేకంగా 1821 నుంచి 1829 వరకు ఈ స్వాతంత్ర్య పోరాటం సాగింది. గ్రీస్ సార్వభౌమత్వానికి బ్రిటన్, ఫ్రాన్స్, రష్యా పూచీగా ఉన్నాయి. గ్రీస్ రక్షిత రాజ్యాలు ఇంచుమించుగా పొన్నెస్ ద్వీపకల్పం అంత విస్తీర్ణంలో ఉండే గ్రీస్ ప్రాంతానికి బవేరియా యువరాజు ఒట్టోను 1832లో మొదటి రాజుగా నియమించారు. 1863లో రక్షిత రాజ్యాలు నియమించిన రెండో రాజు ఒకటవ జార్జి హయాంలో గ్రీస్ ఇప్పటి భూభాగాలన్నింటిని తిరిగి పొందగలిగింది. తన 57 సంవత్సరాల పరిపాలన కాలంలో జార్జి61 పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని ప్రోత్సహించారు. విచ్ఛిన్నమవుతున్న టర్కిష్ సామ్రాజ్యం నుంచి థిసలీ, ఎపిరస్, మాసిడోనియా, క్రెటిలాతో పాటు దాదాపు ఏజియాన్ దీవుల సముదాయం మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో 19, 20 శతాబ్దంలో గ్రీస్ జనాభాలో 6శాతం ప్రజానీకం వేర్వేరు దేశాలకు ప్రధానంగా అమెరికాకు వలసవెళ్లారు. మొదటి ప్రపంచయుద్ధం తర్వాత గ్రీస్ టర్కీతో చేసిన యుద్ధంలో విజయం సాధించలేకపోవడంతో రాజరికం కూలిపోయింది. 1923లో రిపబ్లిక్‌గా ఏర్పడింది. రెండు మిలటరీ నియంతృత్వాలు,ఒక ఆర్థిక సంక్షోభం, తర్వాత రెండవ జార్జ్ ప్రవాసం నుంచి బయటకు వచ్చినప్పటికీ ఇటాలియన్ జర్మనీ ఆక్రమణదారుల్లో గ్రీస్ ఓడిపోయింది. దీంతో 1941 వరకు మాత్రమే జార్జి-2 అధికారంలో ఉన్నారు. బ్రిటీష్, గ్రీస్ సేనలు దేశాన్ని విముక్తి చేసిన తరువాత 1944లో అక్టోబర్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా కమ్యూనిస్టు గెరిల్లాలు భారీస్థాయిలో ఉద్యమం నిర్వహించారు. గ్రీస్ అంతర్యుద్ధం 1944 డిసెంబర్‌లో మొదలై 1949 అక్టోబర్ 16 వరకు సాగింది. కమ్యూనిస్టులను అణిచివేయడానికి మార్షల్ ప్లాన్‌కి ముందు అమల్లో ఉన్న ట్రూమన్ సిద్ధాంతం ప్రకారం అమెరికా నుంచి గ్రీస్‌కు భారీగా సాయమందించింది. గ్రీస్ ఐక్యరాజ్యసమితి చార్టర్‌లో సభ్యురాలే గాక 1951 లో నాటో కూటమిలో కూడా సభ్యత్వం పొందింది. 1967లో ఏప్రిల్‌లో మిలటరీ అధికారం చేజిక్కించుకుంది.

ఒలింపిక్స్ పుట్టిల్లు

గ్రీసులో ఆటలకు అధిక ప్రాధాన్యమిస్తారు. ప్రాచీన కాలం నుంచే విశేష ప్రాధాన్యత ఇచ్చారు. విశ్వవిఖ్యాతి గాంచిన ఒలింపిక్స్ క్రీడలు గ్రీసులోనే జీవం పోసుకున్నాయి. 1896లో ఏథెన్స్‌లోని పానాథెనియన్ స్టేడియం ఈ క్రీడలు తొలి వేదికయింది. ఆ తర్వాత 1896, 1870, 1875, 1906, 2004 సమ్మర్ ఒలింపిక్స్ వరకు అనేక పర్యాయాలు ఒలిపింక్స్‌కు గ్రీసు ఆతిథ్యం అందించింది. గ్రీకు జాతీయ పుట్‌బాల్ జట్టు 2009లో ప్రపంచ 12వ ర్యాంకు పొందింది. 2004లో యుఇఎఫ్ఎ యూరో కప్‌ను ఈ జట్టు సొంతం చేసుకుంది. క్రీడా చరిత్రలో అత్యంత ఆశ్చర్యకరఘటనగా ఈ విజయం ఖ్యాతి పొందింది. గ్రీసులో 16 పుట్‌బాల్ జట్లు వున్నాయి. వీటిలో ఒలంపియాసిస్, పానథినాయికోస్, ఏఈస్, పోక్, ఎఇకె జట్లు కూడా ప్రధానమైనవి. అలాగే గ్రీకు జాతీయ బాస్కెట్‌బాల్ జట్టు కూడా దశాబ్దాలుగా తమ సాంప్రదాయ నైపుణ్యతను ప్రదర్శిస్తూ రాణిస్తోంది. ఇది 2004లో ప్రపంచ నాలుగో ర్యాంకు సొంతం చేసుకుంది. 1987, 2005లో రెండు సార్లు యూరోపియన్ ఛాంపియన్‌షిప్ గెలుపొందింది. గత నాలుగు ఫిఫా పోటీల్లో మూడు సార్లు ఫైనల్‌కు వెళ్లింది.

కాన్‌స్టాంటిన్-2 రాజు ప్రవాసంలోకి వెళ్లిపోయాడు. మిలటరీ తిరుగుబాటు నాయకుడు కల్నల్ జార్జి పాపడోపౌలస్ తనకున్న మితవాద ముద్రని పోగొట్టుకోవడానికి 1973లో మిలటరీ పదవిని వదులుకొని ప్రధాని పదవి చేపట్టాడు. ఆ తర్వాత అధ్యక్ష పదవి చేపట్టాక మార్షల్ లా ఎత్తివేశాడు. 1973 నవంబర్‌లో జరిగిన తిరుగుబాటులో పాపడోపౌలస్ పదవీచ్యుతుడయ్యారు. ఏడు సంవత్సరాలపాటు సాగిన కల్నల్ పాలన అణచివేత, రాజకీయ వ్యతిరేకులను ప్రవాసాలకు పంపటం, మానవ హక్కుల అతిక్రమణ, మొదలగు చర్యలతో విపరీతంగా అపఖ్యాతి పాలై చివరకు సైప్రస్‌ను ఆక్రమించే ప్రయత్నంలో విఫలమై కూలిపోయింది. మిలటరీ పాలన అంతమైన ఐదు నెలలకు 1974లో డిసెంబర్‌లో రిఫరెండం ద్వారాం గ్రీకు రాజరికం రద్దయింది. రిపబ్లిక్ స్థాపించారు. మాజీ ప్రధాని కరామన్లిస్ ప్రవాసం వీడి 1967 తర్వాత మొదటిసారిగా ఏర్పడిన పౌర ప్రభుత్వానికి ప్రధాని అయ్యాడు.

ఆ తర్వాత గ్రీస్‌లో ఎన్నికలు క్రమం తప్పకుండా స్వేచ్ఛగా జరుగుతూ పౌర పాలన సాగుతోంది. 1981 జనవరి 1న గ్రీస్ యూరోపియన్ యూనియన్ సభ్యత్వం పొందింది. మాజీ ప్రధాని జార్జి పాపండ్రో కుమారుడు ఆండ్రియస్ పాపండ్రో పాన్ హెలినిక్ సోషలిస్టు మూవ్‌మెంట్ పార్టీని స్థాపించారు. గ్రీస్ దేశానికి మొదటి సోషలిస్టు ప్రధానిగా ఆండ్రియస్ ఎన్నికయ్యారు. కొసావో సంక్షోభాన్ని పరిష్కరించడానికి 1999లో ఆ ప్రాంతంపై నాటో కూటమి దాడులను గ్రీస్ గట్టిగా వ్యతిరేకించింది. దాడుల వలన ఆర్థిక రాజకీయ సుస్థిరత్వం దెబ్బతిని, లేలాది మంది శరణార్థులు గ్రీస్‌లోకి చొరబడి అవకాశంతో పాటు సెర్బ్‌లతో వారికి ఉన్న తూర్పు ఆర్థడాక్స్ మత సంబంధాలు కూడా దాడులను వ్యతిరేకించడానికి కారణాలు. ఇప్పుడు అధికారంలో ఉన్న పోషక్ పార్టీ ప్రజలను నానా ఇక్కట్లకు గురి చేస్తోంది. ఆఫ్ఘనిస్తాన్ తదిర ప్రాంతాల్లో నాటో సాగిస్తున్న యుద్ధ అవసరాల కోసం గ్రీసు దేశం సైన్యంపై అధికంగా ఖర్చు చేసి అప్పుల్లో కూరుకుపోయింది. ఉద్దీపన ప్యాకేజీల షరతులతో ప్రజల నడ్డి విరుస్తోంది.

★

ప్రత్యేకం



స్టీవ్‌జాబ్స్ @ పిక్సర్

స్టీవ్ జాబ్స్. ఈనాడు ఈ పేరు కొత్తదనానికీ, ఆవిష్కరణకి, విజయానికి పర్యాయపదమైంది. పర్సనల్ కంప్యూటర్‌ని ఇంటింటా ఉండేలా తేగలిగింది స్టీవ్స్. రెండంగుళాల పరికరంలో రెండువేల పాటల్ని పలికించగలిగిందీ స్టీవ్సే. దశాబ్దాల ముందే సెల్‌ఫోన్లున్నా, అసలు సెల్‌ఫోనంటే ఇది అనేలా ఐఫోన్‌ని ఇవ్వగలిగిందీ జాబ్సే. విశేషమేమిటంటే జాబ్స్ హార్డ్‌వేర్ ఇంజనీరూ కాదు, పారిశ్రామిక డిజైనరూ కాదు. ఆ మాటకొస్తే అతనికి సాఫ్ట్‌వేరూ తెలీదు. అతను స్థాపించిన కంపెనీ చేసే ఉత్పత్తులన్నీ అంతకు ముందునుండే ఉన్నాయి. కానీ స్టీవ్స్ చేసింది పరిశ్రమను, ఉత్పత్తులను తన సరికొత్త దృక్కోణంతో, దార్శనికతతో మరింత కొత్తగా పునరావిష్కరించాడు. అయితే ఆయనలో దాగిన వున్న మరో కొత్త కోణం 'పిక్సర్' రూపంలో బయల్పడింది. అదే గొప్ప యానిమేషన్ చిత్రాలకు వేదికైంది.

ఆపిల్ నుండి 1985లో బయటికి 'తోయబడ్డాక' అతన్నీ ఒక స్వాప్నికుడే అనుకున్నారు. కంప్యూటర్ రంగంలో మహామహుడు బిల్‌గేట్స్‌ని ఎదిరించే కల నెరవేరక నీరసబడ్డ వ్యక్తిగానే చూశారు. అతను నీరసపడలేదు. జార్జ్ లూకాస్ నుండి ఐదు మిలియన్ల డాలర్లకు ఓ కంపెనీని కొనుగోలు చేశాడు. మరో ఐదు మిలియన్ల పెట్టుబడి పెట్టి ఆ కంపెనీకి 'పిక్సర్' అని కొత్త పేరిచ్చాడు.

జాబ్స్ యానిమేషన్ కళాకారుడు కాదు. మరి సినిమాలు, యానిమేషన్ రూపొందించే కంపెనీలో అతని ఆసక్తి ఏంటి? అతని ఆసక్తల్లా ఆ కంపెనీ తాలూకు కంప్యూటర్ టెక్నాలజీ. ఆ టెక్నాలజీ ఆధారంగా మరింత మెరుగైన హార్డ్‌వేర్ అభివృద్ధి చేసి ఇతర యానిమేషన్/కంప్యూటర్ గ్రాఫిక్స్ కంపెనీలకు అమ్మడం అతని లక్ష్యం. కానీ, అంతకుముందు డిస్నీ కంపెనీలో పనిచేసి, పిక్సర్‌కి వచ్చిన జాన్ లాసెటర్ అనే యానిమేటర్ స్టీవ్ జాబ్స్ దృష్టిని మరల్చగలిగాడు. అతని కారణంగా స్టీవ్ తన ముందస్తు ప్రణాళికను పక్కన పెట్టి పిక్సర్‌ను యానిమేషన్ రంగంలో తిరుగులేని సంస్థగా మార్చేశాడు. పిక్సర్ స్థాపించక ముందునుండే యానిమేషన్ సినిమాలుండేవి. కానీ ఉన్నవాటికంటే తన ఉత్పత్తి ఎన్నో స్థాయిల గొప్పగా, ప్రత్యేకంగా చేయడం స్టీవ్ స్పెషల్.

యానిమేషన్‌లోనూ అదే చేశాడు. అతను యానిమేటర్ కాదు. సినిమాలు తీయలేదు. కానీ అతనికి ఏ ఉత్పాదన ఏ విధంగా ఉంటే ప్రజాదరణ పొందుతుందో తెలుసు. దాన్ని ఎవరు సమర్థవంతంగా రూపొందించగలరో తెలుసు. దాన్ని ఎలా ప్రజల ముందుకు తీసుకెళ్లాలో తెలుసు. ముఖ్యంగా ఒక ఉత్పాదన అపూర్వంగా రూపొందేలా తోటివారిని ప్రోత్సహించడం, విసిగించడం, అది తాననుకున్న స్థాయికి చేరేవరకు వేచి ఉండడం ఇంకా బాగా తెలుసు. ఈ 'బలాలో, బలహీనతలో' తెలీని లక్షణాలే పిక్సర్‌లో బాగా పనిచేశాయి. లాసెటర్ బృందంలో నిజంగానే 'అపూర్వమైన యానిమేషన్ సినిమాలు రూపొందించే విశ్వాసాన్ని ఇచ్చాయి.

స్టీవ్స్ అందరికంటే ముందు ఆలోచించేవాడు. తన కాలానికంటే ముందుగా యానిమేషన్ సినిమాలు (కంప్యూటర్ - యానిమేషన్) ఎలా ఉండాలో అతను ముందే చూసేవాడు. ఆ దిశగా తన కంపెనీ ఏం చేయగలదో అందులో పని చేసేవారికంటే ముందే దర్శించేశాడు. ఏది చేసినా దాన్ని 'గొప్ప'గా చేయమనేవాడు. గొప్పగా వచ్చేవరకు ఓపికగా ఉండేవాడు. గొప్పగా చేసేవరకూ అందరి వెంటపడేవాడు.

పిక్సర్ ఒక్కటే కంప్యూటర్ యానిమేషన్ సినిమాలు తీసే కంపెనీ కాదు. అంతకు ముందే ఎన్నో కంపెనీలున్నాయి. కానీ పిక్సర్ లాగా తీసినవి ఏవీ లేవు. అసలు కంప్యూటర్ యానిమేషన్ సినిమా అంటే ఇలా ఉండాలి అని ఒక కొలబద్ద వేసింది స్టీవ్స్. ఆ తరువాత అటువంటి సినిమాలే కాదు. ఆ టెక్నాలజీతో మొత్తం సినిమాల నిర్మాణాన్నే సమూలంగా మార్చేయగలిగాడు.

పిక్సర్ సృష్టించిన 'టాయ్ స్టోరీ' 1995 లో సినిమాల్లో విప్లవం సృష్టించింది. అంతవరకు యానిమేషన్ సినిమాల్లో కాస్త పేరున్నది డిస్నీ సంస్థనే. కానీ ఆ తర్వాత హాలీవుడ్‌లో ఏకంగా యానిమేషన్ 'పరిశ్రమ' ప్రారంభమైంది. ఈనాడు 'ఉత్తమ యానిమేషన్ సినిమా' కోసం ఆస్కార్ అవార్డ్ ఉండే పరిస్థితి వచ్చింది. ఇంతటి పరిణామానికి కారణం స్టీవ్ జాబ్స్. యానిమేషన్ స్వయంగా తెలియని స్టీవ్ జాబ్స్ అంటే అతిశయోక్తి కాదు.

స్టీవ్ ఎన్నడూ యానిమేషన్ సినిమాల చర్చల్లో పాల్గొనలేదు. కానీ తన కంపెనీని డిస్నీ స్థాయికి తీసుకెళ్లాలన్న ప్రణాళికలో ఉండేవాడు. ఆ దిశలోనే పనిచేసి, పన్నెండు సినిమాలను నిర్మించేవాడు. ఏ కంపెనీ స్థాయికి తన పిక్సర్‌ను తీసుకెళ్లాలనుకున్నాడో చివరికి ఆ కంపెనీకే తన కంపెనీను అమ్మి, అవతలి కంపెనీకి మేలు చేయడం యాదృచ్ఛికం!

పిక్సర్‌లో తన సమయాన్ని 'అతి సృజనాత్మక దశ'గా అభివర్ణించాడు జాబ్స్. ఆపిల్ నుండి తొలగింపు చేదు మందే, కానీ రోగికి అదే అవసరం అన్నాడు.

ఒక అవివాహిత జంట సంతానంగా జన్మించిన, మరొకరికి దత్తతగా వెళ్లిన, తను స్థాపించిన కంపెనీ నుండి, తను నియమించిన వాళ్లచే వెళ్లగొట్టబడిన, జీవితాన్ని అర్థాంతంగా ముగించే మరణం గురించి ముందుగానే తెలిసిన వ్యక్తి స్టీవ్. అదే మరెవరైనా అయ్యుంటే బహుశా అత్యంత నిరాశ, నిస్పృహ, ఆత్మన్యూనతతో క్షణక్షణం బాధపడుతూ ఉండేవారేమో. కానీ స్టీవ్‌జాబ్స్ అలాంటిలాంటి వ్యక్తి కాదు కదా. అందుకే చివరి వరకూ తన తోటివారికంటే ముందస్తుగానే ఆలోచించాడు. ఫ్యూచరిస్టిక్ ఉత్పాదనలే - అవి ఫోన్లైనా, సినిమాలైనా, కంప్యూటర్లైనా రూపొందించాడు. ముందస్తుగానే వెళ్లిపోయాడు. ఆపిల్ రాలిపోయింది.

- డా॥కాకర్లమూడి విజయ్

భారతీయ విద్య... పాలక వర్గాల ప్రభావం



విద్య మనిషిలోని శక్తియుక్తులను వెలికి తీసి, ప్రతిభకు మెరుగు పెడుతుందని గుర్తించారు మన పూర్వీకులు. గురు శిష్య పరంపరల గురించి ఆశ్రమ విద్య గురించి మనం చాలాసార్లు వింటుంటాము. కాని వర్ణ వ్యవస్థ రాచరిక అవసరాలు మన విద్య ప్రజాస్వామిక స్వరూపం సంతరించుకోకుండా అడ్డుపడ్డాయి. బ్రిటీషు వలసపాలకుల రాకతో విద్యావ్యవస్థ ఆధునికత సంతరించుకున్నా ప్రాధమ్యాలు తారుమారయ్యాయి. తమ వలస పాలన అవసరాలకు అనుగుణంగా గుమాస్తాలను తయారు చేసే విద్యావిధానానికి శ్రీకారం చుట్టారు. వేషభాషల్లో భారతీయులుగా కనిపిస్తూనే తమ ప్రయోజనాలను 'వంటపట్టించుకున్న' నయా విద్యావంతుల తరాన్ని తయారు చేయాలన్నదే వారి సంకల్పం. ఆ విధంగా పరోక్షంగా భారతీయుల్లోని చైతన్యాన్ని కాలరాచే ప్రయత్నాలు చేశారు. స్వాతంత్ర్యానంతరం మన 'నల్ల' పాలకులు కూడా విద్యా వ్యవస్థను మార్చలేదు. కనుకనే సామ్రాజ్యవాద ప్రపంచీకరణ నేపథ్యంలో ఆ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా మన విద్యా వ్యవస్థలో విన్యాసాలు చేయిస్తున్నారు. దీని స్థానంలో చైతన్యవంతమైన సమాజాన్ని పునరుద్ధరించాలంటే...ముందుగా మన విద్యావ్యవస్థను దేశీయ అవసరాలకు తగినట్టు ప్రజాస్వామీకరించుకోవాలి. దానికోసం విద్యారంగ చరిత్రను తెలుసుకోవాలి. ఈ అవసరాన్ని తీర్చేదే 'భారత దేశ విద్యాచరిత్ర' పుస్తకం. విద్యావేత్త కొమ్మారెడ్డి రాసిన ఈ పుస్తకం వేదకాలం నుంచీ మొదలుకుని నేటి వరకూ విద్యారంగంలో చోటు చేసుకున్న మార్పులు, ప్రధాన పరిణామాలను తెలుపుతుంది. వాటి వెనుకనున్న రాజకీయ, ఆర్థిక, సామాజిక కోణాలను చాలా స్పష్టంగా వివరిస్తుంది. చారిత్రక పూర్వరంగం (వేదవిద్య, బౌద్ధవిద్య, ఆశ్రమ (గురుకుల)) విద్య, 19వ శతాబ్ది ప్రారంభంలో విద్య, ఈస్టిండియా కంపెనీ విద్య (1813 చార్టర్, 1854 డిస్పాచ్, 1882 విద్యాకమిషన్,1934 సార్జంట్ రిపోర్ట్,1944 జాకీర్ హుస్సేన్ కమిటీ), స్వాతంత్ర్యానంతర విద్య..అనే ప్రధాన విభాగాలుగా విడదీసి పొందుపరిచారు. ఒక్కొక్క అంశం కింద అది జరిగిన తీరు, తెచ్చిన మార్పులు, ఫలితాలను విశ్లేషణాత్మకంగా విశదపర్చారు. చరిత్ర అనగానే మనకర్థంగాని భాషలో ఉంటుందని భావిస్తాం. దీనికి భిన్నంగా విషయాన్ని అందరికీ అర్థమయ్యే సరళమైన భాషలో అందించడం ఈ పుస్తక ప్రత్యేకత. తక్కువ పేజీల్లోనే ఎక్కువ విషయాన్ని పొందుపర్చిన ఈ పుస్తకం విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యావేత్తలు, విధానకర్తలు, సామాజికులు ప్రతి ఒక్కరూ చదవదగ్గ పుస్తకం.

భారత దేశ విద్యాచరిత్ర- కె. కేశవరెడ్డి, పేజీలు : 140, వెల : రూ.75,

ప్రతులకు : ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలతో పాటు ఇతర పుస్తక కేంద్రాలు.

- ఎన్. మదనయ్య

కొత్త పుస్తకాలు

మళ్లీ మళ్లీ చదువుకోవాలి



'ఉపాధ్యాయుడు ఎలా ఉండాలి?' అనే ఈ పుస్తకం మళ్లీ మళ్లీ చదువుకోవాల్సిన పుస్తకం అంటే అతిశయోక్తి కాదు. నేటి సమాజంలో గురువులూ పాఠాలు నేర్చుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ తరుణంలో రచయిత డాక్టర్ గుమ్మనూరు రమేష్‌బాబు ఈ పుస్తకం తేవడం ఎంతో సముచితం. 'గురు' శబ్దం.. కర్తవ్యాన్ని ప్రబోధించేదే కాక అంధకారాన్ని తొలగించేది. గురువు జ్ఞానజ్యోతి. 'కొవ్వొత్తి తాను వెలుగునిస్తూ కరిగిపోతుంది'... ఆ రీతిగా గురువు తన శిష్యులను కన్నబిడ్డలుగా ఆదరిస్తూ తనను మించినవారు కావాలన్న ఆశయంతో తన విద్యుక్తధర్మాన్ని నెరవేర్చాలి. 'ఆలోచనాత్మక బోధనకు తావు లేకుండాపోయింది. విద్యార్థులలో ప్రశ్నించే విధానాన్ని రేకెత్తించాలి. నైతిక విలువల ఆవశ్యకతనూ ఆచరణలో పెట్టేలా విద్యార్థులను ఉపాధ్యాయులే తీర్చిదిద్దాలి' అంటూ గురుశిష్యుల ప్రేమానుబంధం ఎంతో పవిత్రంగా ఉండాలి. అది సర్వేపల్లి రాధాకృష్ణన్ నిరూపించారని' ముందుమాటలో జానమద్ది హనుమచ్ఛాస్త్రి గారు చెప్పిన మాటలు అక్షరసత్యాలు. ఉపాధ్యాయుడు నిత్యవిద్యార్థి అయితేనే ఇవన్నీ సుసాధ్యం. కేవలం సమాచారాన్ని అందించటమే విద్య కాదని రచయిత ఈ పుస్తకంలో నొక్కి చెప్పారు. విద్యార్థులలో నిగూఢంగా ఉన్న ప్రజ్ఞను వెలికితీసి, తీర్చిదిద్దటమే విద్య యొక్క మహోన్నత లక్ష్యమన్నారు. విద్య సృజనాత్మకతను ప్రోత్సహించేదిగా ఉండాలన్నారు. అదే సందర్భంలో శాస్త్రీయ దృక్పథ అవసరాన్ని చక్కగా వివరించారు. ఈ పుస్తకంలోని ప్రతి వ్యాసమూ స్ఫూర్తివంతంగానూ, శాస్త్రబద్ధంగానూ ఉండడం వెనుక రమేష్‌బాబు లక్ష్యసిద్ధి కనిపిస్తుంది. ఉపాధ్యాయులు ఎలా ఉండాలో ఉదాహరణలు ఇవ్వడమే కాకుండా మహనీయుల సూక్తులతో, స్ఫూర్తిదాయకమైన రచనలతో పుస్తకాన్ని అందించిన రచయిత రమేష్‌బాబు అభినందనీయులు. పుస్తకం అట్టమీదే కుండను తయారుచేసే చిత్రాన్ని ముద్రించడం ఎంతో అర్థవంతంగా ఉంది. ఇందులో రచయిత సృజనాత్మకత ఉట్టిపడుతుంది అంటే అతిశయోక్తి కాదేమో. అలాగే లోపలి సారమూ అంతే నిశితంగా ఉంది. 'ఉపాధ్యాయుడికి లింకన్ లేఖతో మొదలుపెట్టి... దీపమై వెలగాలి! వెలుతురును పంచాలి! విద్యార్థిగానే రాణించాలి! విలువలను కాపాడాలి! ఆదర్శంగా ఉండాలి! సూర్యుడిలా ప్రకాశించాలి! పాఠ్యగ్రంథంగా విరాజిల్లాలి! పాఠశాలగా పరిఢవిల్లాలి! జాతికి పునాది కావాలి! ప్రభావితం చేయగలగాలి! ధీరుడిగా వెలుగొందాలి! కార్యసాధకుడిగా నిలవాలి! జాగృతిని కలిగించాలి! జగజ్జేతలను రూపొందించాలి! 'ముందడుగే వేయాలి!' అంటూ రచించిన 15 వ్యాసాలూ ఒక్కొక్కటి ఒక్కో నినాదం. ప్రతి నినాదం వెనుక రచయిత లక్ష్యం ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. ఇది చదివిన ప్రతి ఉపాధ్యాయుడు తమని తాము మరింత మెరుగుపెట్టుకొంటాడనడంలో ఎటువంటి సందేహం లేదు. అందుకే ప్రతి ఉపాధ్యాయుడు, కాబోయే ఉపాధ్యాయులూ ప్రతి ఒక్కరూ తెలుసుకోదగిన విశేషాలున్న ఈ పుస్తకాన్ని తప్పక చదవాల్సింది... అప్పుడప్పుడూ పునఃపఠనమూ చేయాల్సింది. అంటే ప్రతి ఉపాధ్యాయుడి చెంతనుండాల్సిన పుస్తకమిది.

డా॥గుమ్మనూరు రమేష్‌బాబు, పేజీలు: 72, వెల: రూ.50/-,

ప్రతులకు: విజయవాణి ప్రింటర్స్, చౌడేపల్లి, చిత్తూరు జిల్లా.

- శాంతిశ్రీ



గర్భం దాల్చిన దగ్గరనుంచి... పుట్టబోయేది ఆడ పిల్లో, మగ పిల్లవాడో... అన్న ఆలోచన రాకుండా వుండదు. అమ్మాయైనా, అబ్బాయైనా పరవాలేదు అనుకునేవారి సంఖ్యా తక్కువ కాదు. కాకపోతే పిండంగా వున్నప్పటి నుంచి ఎన్నో మార్పులు జరుగుతుంటాయి. అసలు పిండం ఆడపిల్ల కావడానికి, మగపిల్లవాడు కావడానికి కారణం ఏంటి? తర్వాత కూడా ఈ ఇద్దరిలో వచ్చే మార్పులేంటనేది ఈ వారం వికాసంలో ...

ఆడ... మగ... తేడాలు

- సి.వి. సర్వేశ్వరశర్మ
ఫోన్ నెం: 9866843982
sarma.chavali@gmail.com

శిశుజననానికి కేంద్రస్థానం తల్లిగర్భం. ఇక్కడ పిండం ఆడ లేదా మగ శిశువుగా తయారయ్యేందుకు కావలసిన సదుపాయం ఉంటుంది. తల్లిగర్భంలో పిండం ఆరువారాలు ఎదిగాక జెనిటిక్ కోడ్‌ను బట్టి అది ఆడ లేదా మగ శిశువుగా అభివృద్ధి చెందడం మొదలవుతుంది. బిడ్డకు చేరే 23వ క్రోమోజోమ్ జత ఈ జెనిటిక్ కోడ్‌ను తెలియజేస్తుంది. తండ్రి నుండి 'వై' క్రోమోజోమ్‌ను సంతరించుకుంటే మగ శిశువుగాను, 'ఎక్స్' క్రోమోజోమ్‌ను సంతరించుకుంటే ఆడ శిశువుగా అభివృద్ధి చెందుతుంది.

జన్మించినప్పుడే ఆడ శిశువుల ఎముకల గూడు మగశిశువుల ఎముకల గూడు కన్నా కొంచెం పక్వదశలో ఉంటుంది. ముట్టుకుంటే ఆడశిశువు స్పందించినంత వేగంగా మగ శిశువు స్పందించదు. కంటికి కన్పించే వస్తువులను చూసి మగ శిశువులు స్పందిస్తారు. ధ్వనులు, వాసనలకు ఆడశిశువులు బాగా స్పందిస్తారు.

ఏడాది వయసు వచ్చేసరికి మగబిడ్డ ఎముకల గూడు బలం పుంజుకుని ఆడబిడ్డ ఏముకల గూడు కన్నా పక్వదశకు వస్తుంది. రెండేళ్ల వయసు వచ్చేసరికి మగ బిడ్డలో తిరగబడే ధోరణి మొదలవుతుంది. ఎనిమిదేళ్ల వయసులో మగ పిల్లలు కొన్ని పనుల నిర్వహణలో ఆడపిల్లల కన్నా ఆధిక్యత ఉన్నట్లు ప్రవర్తిస్తారు. పదేళ్ల వయసు వచ్చేసరికి గణిత శాస్త్రంలో ఆడపిల్లల కన్నా మగ పిల్లలు తమ ప్రతిభను ప్రదర్శిస్తారు.

వయసు వస్తుంటే!

పిల్లలు పెరిగి పెద్దవారవుతూ యవ్వన దశలో అడుగుపెట్టే సమయంలో మగ పిల్లలు ఆడపిల్లల కన్నా బలంగా ఉంటారు. ఇరువురిలో పునరుత్పాదక అవయవాలు వేగంగా అభివృద్ధి చెందడం మొదలవుతుంది. ఎత్తు పెరుగుతారు. మగ పిల్లలు ఆడపిల్లల కన్నా పది శాతం ఎక్కువ ఎత్తు ఎదుగుతారు.

సంభాషణ విషయంలో మగవారి కన్నా ఆడ పిల్లలు ఎక్కువ నైపుణ్యం కల్గి ఉంటారు. ఆడవారి కన్నా మగవారిలో ఎముకలు ఒకటిన్నర రెట్లు అధిక బలాన్ని కల్గి ఉంటాయి. కండర బలంలో కూడా ఈ ఆధిక్యత ఉంటుంది. ఆడవారిలో కొవ్వు మాత్రం మగవారి శరీరంలోని కొవ్వుకు రెండున్నర రెట్లు ఎక్కువగా ఉంటుంది.

ఆడవారిలో ఈస్ట్రోజన్ అనే హార్మోన్ ఉత్పత్తి అవుతుంది. దీని కారణంగానే వారి శరీరానికి పిల్లల్ని కనే శక్తి సమకూరుతుంది. అంతేకాదు ఇది వారి శరీరానికి సహజసిద్ధమైన ఆరోగ్యాన్ని చేకూరుస్తుంది.

మెనోపాజ్ తర్వాత ఆడవారిలో ఈస్ట్రోజన్ హార్మోన్ ఉత్పత్తి తగ్గిపోతుంది. స్త్రీ జీవితంలో ఆరోగ్యం విషయంలో ముఖ్యభూమిక వహించిన ఈ హార్మోన్ పాత్ర దెబ్బతిన్నా పాతవాసనలు శరీరంలో ఇంకా కొనసాగి ఆరోగ్యాన్ని రక్షిస్తాయి. మగవారి విషయంలో వీర్యోత్పత్తి తొంభై సంవత్సరాల వయసులో కూడా ఉంటుంది.

మరికొన్ని తేడాలు

సగటున తల్లి గర్భంలో వందమంది ఆడశిశువులు ఎదుగుతూ ఉంటే, నూటముప్పై నుండి నూటయాభై మగశిశువులు తల్లి గర్భంలో ఎదుగుతున్నట్లు ఒక రిపోర్టు. అయితే చివరకు ప్రతి వందమంది ఆడశిశుజననాలకు నూట అయిదు మంది మగశిశు జననాలు జరుగుతున్నాయి.

65 సంవత్సరాల వయసు దాటిన మగవారిలో 68 మంది హాయిగా జీవిస్తుంటే వందమంది ఆడవారు హాయిగా జీవిస్తున్నారు. ధ్వనులు విని వాటిని విశ్లేషించడంలో ఆడవారికి నైపుణ్యం ఎక్కువ. మగవారికి కాంతి విషయంలో ఇటువంటి నైపుణ్యం ఉంటుంది.

కావలసిన పౌష్టికాహారం తీసుకుంటూ శరీర బరువును అదుపులో వుంచుకోవడంలో ఆడవారికంటే మగవారిదే పైచేయి. అనారోగ్యం వచ్చిందంటే మహిళలు మగవారికంటే నలభై శాతం ఎక్కువ రోజులు మంచం మీద ఉంటారు.

మనిషి ముఖం కన్పిస్తే ఆడశిశువులు కేరింతలు కొడతారు. మగశిశువులు చిరునవ్వుతో సరిపెడతారు. ఆడపిల్లల కన్నా మగ పిల్లల్లోనే ఎడమచేతి వాటం ఎక్కువగా ఉంటుంది. హ్రస్వదృష్టి ఎక్కువగా మగపిల్లల్లో కనిపిస్తుంది. నలభై ఏళ్ల వయసు లోపులో ఎలర్జీ బాధలు ఆడవారికన్నా మగవారిలో ఎక్కువగా ఉంటాయి.

మగవారి ఆధిక్యత

తిరగబడే ధోరణి మగవారిలో ఎక్కువగా ఉంటుంది. ఈ ధోరణి రెండేళ్ల వయసు నుండి మొదలయి అలా కొనసాగుతుంది. దీనికి ప్రధాన కారణం వారిలోని మగ సెక్స్ హార్మోన్ 'టెస్టోస్టిరాన్'. ఆడవారిలో అణకువ ధోరణికి కారణం సామాజిక సంస్కృతి అనేది ఒక

అభిప్రాయం.

స్త్రీ ఇంట్లో ఉండాలనే ఈ సంస్కృతి కారణంగా మొదటి నుండి ఆమెలో అణకువ మొదలవుతుంది. మగవారిలో కన్పించే పోటీతత్వం ఆడవారిలో అంతగా కన్పించదు. రాజకీయరంగంలో పేరు తెచ్చుకున్న పలువురు మహిళలు బాహాటంగా పురుషులు ఎన్నుకున్న మార్గాలే ఎంచుకున్నట్లు పరిశోధకులు చెబుతున్నారు.

మగవారు స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకుంటారు. ఆడవారు సహ ఉద్యోగులు, కింది ఉద్యోగులను సంప్రదించి నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుందని లండన్‌లోని ఒక పరిశోధక బృందం ప్రకటించింది.

చర్చల సమయంలో మగవారు తక్కువ విని ఎక్కువ మాట్లాడతారు. ఆడవారు ఎక్కువ విని తక్కువ మాట్లాడతారు. గృహసమస్యలు, దారిద్ర్య నిర్మూలన, అసమానత వంటి సమస్యల పరిష్కారం పట్ల ఆడవారు ఎక్కువ మక్కువ చూపుతారు.

శాస్త్రవేత్తల ఉవాచ!

ఆడ, మగ మధ్య మేధోపరంగా కొన్ని తేడాలు ఉన్నట్లు శాస్త్రవేత్తల దృష్టికి వచ్చింది. ఆడపిల్లలు మగ పిల్లల కంటే వేగంగా మాట్లాడతారు. ఆడపిల్లలు ఎక్కువగా పదాలు ఉపయోగిస్తారు. వాక్య నిర్మాణం, వ్యాకరణం, ఉచ్ఛారణలో మగ పిల్లల కన్నా ఆడపిల్లలు ఎక్కువ తప్పులు చేస్తారు.

మగవారికి 'స్థల' సంబంధమైన విషయంలో ఏకాగ్రత ఎక్కువగా ఉంటుంది. ఉదాహరణకు ఒక చిత్ర పటం గీయాలంటే మగవారు సులువుగా గీయగల్గుతారు. ఇంజనీరింగ్, మేథమేటిక్స్, ఆర్కిటెక్చర్‌లో మగవారిదే పై చేయి అంటున్నారు. కానీ పరిశీలనలో ప్రస్తుత పరిస్థితి ఇలా లేదు. అనేక ఇంజనీరింగ్ కళాశాలల్లో నేను వ్యక్తిత్వ వికాసంపై ప్రసంగాలు చేసినప్పుడు ఆడపిల్లలే ఈ కోర్సు ఎక్కువగా చదువుతున్నారు.

శారీరక తేడాలు

ఆడపిల్లల్లో 'ఈస్ట్రోజన్' అనే హార్మోను కారణంగా ఎముకల పెరుగుదల కొంత అభివృద్ధి తర్వాత స్తంభించిపోతుంది. ఈ కారణంగానే ఆడవారి శరీరనిర్మాణం మగవారి శరీర నిర్మాణాన్ని మించదు.



ఆడవారికి నడుము వద్ద, తొడల వద్ద చర్మం కింద కొవ్వు బాగా పేరుకుపోతుంది. ఈ కారణంగానే వారి శరీరం చక్కగా నునుపుదేరి ముట్టుకుంటే మెత్తగా ఉండేట్లు తయారవుతుంది. స్త్రీలలో లావణ్యతకు, సుకుమారత్వానికి కారణం ఈ ఆడసెక్స్ హార్మోన్లే.

ఆడవారికి మగవారికన్నా ఆయుష్షు ఎక్కువగా ఉంటుంది. మగవారిలో ప్రోటోప్లాజమ్ నశించే రేటు ఆడవారిలో కన్నా ఎక్కువగా ఉంటుంది. ఆడవారి కంటే మగవారు చురుగ్గా ఉంటారు. అందువల్ల మగవారికి అయినంత ఖర్చు ఆడవారికి కాదు. ఆడవారిలో హార్మోనుల నిర్మాణం మగవారిలో కన్నా మెరుగ్గా ఉంటుంది.

మగ పిల్లల్లో యవ్వనం పదకొండు, పన్నెండు సంవత్సరాల వయసులో మొదలవుతుంది. పదహారు, పంతొమ్మిది సంవత్సరాలు వచ్చేసరికి పూర్తవుతుంది. ఈ ఎదుగుదల సమయంలోనే శరీరంలోని జీన్స్ ప్రొటీన్ల ఉత్పత్తి, న్యూక్లిక్ ఆమ్లాల తయారీ అవధి నిర్ణయించబడుతుంది. వీటిమీదనే శరీరం మొత్తం ఎదుగుదల ఆధారపడి ఉంటుంది.

ఆడ సెక్స్ హార్మోన్ 'ఈస్ట్రోజన్' స్త్రీ గర్భాశయంలో ఉత్పత్తి అవుతుంది. మగ సెక్స్ హార్మోన్ వారి వృషణాల్లో తయారవుతుంది.

★

మా ఊరు

కళలకు పుట్టిల్లు

మా ఊరి పేరు పాలమర్రు. ఎంతో అందంగా ఉంటుంది. పూర్వం మా ఊళ్లో పాడిపంటలు ఎక్కువగా ఉండేవట. అందుకే క్షీరపురి అని పిలిచేవారు. కాలక్రమేణా అదే పాలమర్రుగా మారింది. మా ఊరి గురించి చెప్పుకోవాలంటే చాలా వున్నాయి. కళలకు పుట్టిల్లు లాంటిది. ఏ పండుగ వచ్చినా భలే సందడిగా ఉంటుందిలే. ఆ సమయంలో బోలెడు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తారు. వాటిలో భజన కార్యక్రమం ఒకటి. తేళ్ల సుబ్బారావుగారు మా వూరి భజన మాస్టారు. ఈయన ఆ కళలో ఆరితేరిన వారు. బంగారు గండపెండేరం కూడా బహుమతి పొందారు. ఇక క్రీడల విషయానికొస్తే రాష్ట్ర స్థాయిలో రాజుపాలెం రాంబాబు, జాతీయ స్థాయిలో పెద్దిపాగ ప్రవీణ్ మొదలైన వారు పాల్గొని బహుమతులు కూడా పొందారు. చెప్పాలంటే బోలెడు.... సంఘ సేవకులు, క్రీడాకారులు... ఇలా అనేక రంగాల్లో పేరుపొందిన వారున్నారు. మా గ్రామ అభివృద్ధికి ముద్దన చెంచయ్య, జంపని వెంకటేశ్వర్లు, జస్టిస్ కృష్ణమ[illegible], మోదుకూరి సుబ్బారావు గారు ఎంతో కృషి చేశారు. మా ఊరంటే నాకు చాలా ఇష్టం.

ఆర్. శశాంక్,

3వ తరగతి, లయన్స్ మాంటిస్సోరి స్కూల్, పెదనందిపాడు, గుంటూరు.



ఏమేం వున్నాయ్?

ఫ్రెండ్స్.. ఏంటలా చూస్తున్నారు? ఇదేదో వింత జంతువనుకుంటున్నారా? సరదాగా మూడు జంతువుల శరీర భాగాలను కలిపి ఈ వింత జంతువును తయారు చేశాం. దీన్ని బాగా పరిశీలించి ఇందులో ఏఏ జంతువుల శరీర భాగాలున్నాయో చెప్పాలి.



జవాబు: జిరాఫీ, ఫ్లెమింగో, కంగారూ

ఆహ్వానం

హాయ్ నేస్తాలూ! మీరు కథలు, కవితలు, బాగా రాస్తారట కదా. జోక్స్ బొమ్మలు, సూపర్‌గా వేస్తారట. మీకు బోలెడన్ని తమాషా ప్రశ్నలు - జవాబులు, చారిత్రక ఘట్టాలు తెలుసంట కదా. మరి అవన్నీ ఎంచక్కా పోస్టు కార్డుమీద రాసి పంపండి. మీ పేరు, స్కూల్‌తో సహా ప్రచురిస్తాం.

<u>మా చిరునామా</u>

బాలనేస్తాలు, ఆదివారం అనుబంధం, ప్రజాశక్తి,
ప్లాట్ నెం.21/1, ఎం.హెచ్ భవన్, ఆజమాబాద్,
ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్-500020.

క్విజ్‌మాస్టర్

1. కంప్యూటర్ కనుగొన్నదెవరు?
2. దాస్ కాపిటల్ రచించింది.
3. అనిబీసెంట్ ఏ దేశస్థురాలు.
4. బంగ్లాదేశ్ ఏర్పడిన సంవత్సరం.
5. వాటర్లు యుద్ధం జరిగిన సంవత్సరం.

- అనుముల కృష్ణచైతన్య, సత్తెనపల్లి.

జవాబు: 1. ఛార్లెస్ బాబేజ్, 2. కారల్ మార్క్స్, 3. ఐర్లాండ్, 4. 1971, 5. 1815

హ్హా..హ్హా

నాన్న : రామూ! మొక్కలకు వేన్నీళ్లు పోస్తున్నావేంటి?
రాము : చలికాలం కద నాన్నా! మొక్కలకు చలి పుడుతుందని!



ఆర్. అశోక్ కుమార్, 4వ తరగతి, లయన్స్ మాంటిస్సోరి స్కూల్, గుంటూరు.

రంగులు నింపేద్దాం

చిన్నారులూ...కింది బొమ్మ చూడ్డానికి బోసిగా ఉంది కదా! ఏ రంగులు వేస్తే బావుంటుందో చూసి చకచకా వేసేయండి. సూపర్‌గా ఉంటుంది.



టెర్న్ పక్షులు

ఈ వారం చెప్పుకోబోయే పక్షి పేరు టెర్న్. ఈ జాతిలో రెండు రకాల పక్షులున్నాయి. ఒకటి మీసాల టెర్న్. ఇది చూడ్డానికి పావురంలా కనిపించినా దానికంటే సన్నగా ఉంటుంది. కాకపోతే దీని తోక బూడిద రంగు, తెలుపు కలిసిన రంగులో ఉంటుంది. చివర కొద్దిగా చీలి ఉంటుంది. ముక్కు ఎరుపు, నలుపు కలిసిన రంగులో ఉంటుంది. వేసవి కాలంలో వీటి తలమీద నల్లటి ఈకల టోపీ తయారవుతుంది. రెండోది రివర్ టెర్న్. ఇది మీసాల టెర్న్ కంటే కొంచెం పెద్దది. నదుల దగ్గర జీవిస్తుంది. దీని తలమీద గోధుమరంగు ఈకల టోపీ ఉంటుంది. గుడ్లు పెట్టే కాలంలో ఆడ పక్షికి ఈ ఈకల టోపీ నలుపు రంగులోకి మారుతుంది. విచిత్రం ఏంటంటే... ఎగిరేటప్పుడు మామూలుగానే కనిపించే వీటి రెక్కలు ముడుచుకుని ఉన్నప్పుడు మాత్రం తోక కంటే ఎక్కువ పొడవుగా ఉంటాయి. వరి చేల దగ్గర, బురద నీరు ఎక్కువగా ఉన్న ప్రదేశాల్లో ఇవి నివశిస్తాయి. కాలివేళ్లమధ్య చర్మం ఉన్నా ఈదలేదు.



విహంగం

కవలలు ఏవి?

హాయ్.. ఐస్‌క్రీములను చూస్తుంటే నోరూరిపోతుంది కదూ. ఎప్పుడెప్పుడు తినేద్దామా అనిపిస్తుంది వీటిని చూస్తుంటే. కానీ వాటిలో రెండు మాత్రమే కవలలు. అవేంటో చెప్పేయండి.



కవలలు ఏవి?:4,6



చిత్ర విచిత్రం

షాపింగ్‌కి వెళ్తున్నా! మీరూ వస్తారా?

మాటల కోట - 72

రూపకల్పన : కొమ్మాలపాటి



అడ్డం :

1. కర్నాటకలో గనుల అక్రమ తవ్వకాలకు పాల్పడిన 'బ్రదర్స్' (2)
2. చేదు కూరగాయ (3)
4. త్వరగా (2)
5. మోసం చేస్తే ఇది పెట్టాడంటారు (2)
6. ఓర్మి (3)
7. లేకపోవడం (2)
8. ...టమారాలు, హెయలు (2)
11. రష్యన్ నవల 'అమ్మ' కథానాయకుడు (3)
14. వృషభము (2)
16. కర్రగాని కర్ర, ఒక దినుసు (4)
18. కడవ (2)
20. నోము (2)
21. కాఫీలో చక్కెర ఎక్కువైతే ఇలా వున్నాయంటాం (3)
23. ఉప్పు (3)
25. ఇంటి పై కప్పు నిలవడానికి ఉపయోగించే దుంగ (2)
27. దళము (2)
29. గని నుంచి తీసినది (4)
30 ధనవంతుడు, పేరులోనే సిరిని కలిగిన వాడు. అటునుండి (4)

నిలువు :

1. తింటే ఇవే తినాలి. వింటే రామాయణం వినాలి అంటారు (3)
2. కారల్‌మార్క్స్ ప్రసిద్ధ రచన (4)
3. కాపాడటమే.. సరళంగా (2)
4. రెండు, ఇద్దరు (2)
9. పిల్లనిచ్చినవాడు. కింద నుంచి పైకి (2)
10. ఇంటికైనా, పొలానికైనా, దేశానికైనా ఇది ఉండాల్సిందే (2)
11. కలుగు, దక్కు, ఈ జన్మకింతే. క్రావడి లోపించింది (2)
12. నెయ్యి పుట్టిల్లు (2)
13. ధర (2)
14. కవిత్రయంలో చివరివాడు (3)
15. రజనీకాంత్, మనీషా కొయిరాలా జంటగా వచ్చిన సినిమా (2)
16. నెల సంపాదన(2)
17. పుర్రె (3)
19. ...భీమ పాకం (2)
20. పెద్ద పుండు (2)
22. ఇది మోగినట్లు కనకంబు మోగునా (2)
24. వనంలో పుట్టింది (3)
25. మహేష్‌బాబు, సమంత జంటగా వచ్చిన తాజా చిత్రం (3)
26. ...శిఖ పర్యంతం పరిశీలించారంటారు (2)
28. కరువు (2)

మాటలకోట - 71 జవాబు

	1 పాం	2 ద	వ	3 వ	వ	4 వా	సం	
5 వెం		బ్బ		డి		మ		6 వే
7 క	న్న		8 త్రి	వే	ణి		9 హా	యి
ట		10 మా		లు		11 గి		ప
12 ర	థ	యా	త్ర		13 త	ల	గ	డ
మ		ఐ		14 బు		క		గ
15 ఐ	16 అ		17 క	బా	డీ		18 వా	లు
	లు		19 లా	ద్ర			ర	
	20 క	ర	మ్	చం	ద్	గాం	ధి	

మళ్లీ చేయను!



రాజు: తప్పు చేశాను ఫాదర్! నేను పని చేస్తున్న చోటనుంచి కొన్నేళ్లుగా కలప దొంగిలించి తప్పుచేశాను ఫాదర్. ఆ పాపం నుంచి నన్ను విముక్తి చేయండి.

ఫాదర్: ఎంత తీసుకుపోయావేమిటి?

రాజు: ఎంత ఫాదర్? నా ఇంటికి, నా కుమారుడి ఇంటికి, నా ఇద్దరు కుమార్తెల ఇంటికి, పొలంలో మా కాటేజీకి అవసరమైనంత మాత్రమే !

ఫాదర్: ఇది చాలా తీవ్రమైన పాపం. మరోసారి తిరిగి ఇలాంటి పాపం చేయకుండా ప్రాయశ్చిత్తంగా ఏం నిర్ణయించాలో ఆలోచిస్తున్నాను!

రాజు: లేదు ఫాదర్. నేను మరోసారి అదే పని చెయ్యను. కానీ ఫాదర్ మీ దగ్గర ఇళ్ల ప్లాన్‌లేమైనా ఉంటే చెప్పండి కలప తేగలను!!

- సత్య

మూగ చిత్రకారుడు

ముత్తులింగం గోవిందమ్మ దంపతులకు లేకలేక ఓ బాబు పుట్టాడు. ఆ చిన్నారికి నాగలింగం అని పేరు పెట్టుకుని అల్లారు ముద్దుగా పెంచుకున్నారు. వాడికి నాలుగేళ్లు వచ్చినా నోరు విప్పి ఒక్క మాట కూడా మాట్లాడేవాడు కాదు. "బ్బె... బ్బె... బ్బె..." అంటూ సైగలు చేసేవాడు. పిల్లవాడు మూగవాడనే విషయం ఆ దంపతులకర్థమైంది. దాంతో వారు బాగా కుంగిపోయారు. ఇంకాస్త పెద్దయ్యాకైనా మాటలు వస్తాయేమోలే అన్న ఆశతో ఉన్నారు.

ఒకసారి వాళ్ల ఊరికో స్వామీజీ వచ్చాడు. ఆ దంపతులు తమ కుమారుడ్ని ఆయన దగ్గరికి తీసుకువెళ్లారు. మనసులోని బాధను బైట పెట్టారు. శాంతంగా విన్న స్వామీజీ "అసలు పిల్లలు లేనిదానికన్నా ఎవరో ఒకరు ఉన్నందుకు ఆనందించండి. మూగవాడని బాధపడకుండా, విద్యా బుద్ధులు నేర్పించండి. పిల్లవాడికి నచ్చిన పనిలో శిక్షణ ఇప్పిస్తే మంచి ప్రయోజకుడౌతాడు" అన్నాడు.

ఆయన మాట ప్రకారం నాగలింగానికి చక్కగా చదువు చెప్పించారు. వాడు చిత్రకళ పట్ల ఆసక్తి కనబరచడంతో, నాయకలింగం అనే చిత్రకారుని వద్ద శిక్షణ ఇప్పించారు. శ్రద్ధగా నేర్చుకున్న నాగలింగం చెట్టు, పుట్ట, పిట్ట, మనిషి.. ఇలా ఏది కనిపిస్తే అది గీస్తుండేవాడు. ఆ గ్రామంలోని ఉత్సాహవంతులంతా అడిగి మరీ లింగంతో తమ బొమ్మలను వేయించుకునేవారు.

"నీ కొడుక్కి మాటొక్కటి లేదనే గానీ, మహా తెలివైనవాడయ్యా" అని ఊరి జనం ప్రశంసిస్తుంటే ఆ దంపతులు పొంగిపోయారు.

నాగలింగానికి పదహారేళ్ల వయసొచ్చింది. ఓ రోజు "రాజుకు నా విద్యను చూపించి, ఏదో ఒక ఉద్యోగం ఇమ్మని అడుగుతా" అని సైగతో తల్లిదండ్రులకు వివరించాడు.

వారు ముందు భయపడ్డా తర్వాత ఒప్పుకున్నారు. కొడుకు ప్రయాణానికి రొట్టెలు, కొంత డబ్బు ఇచ్చి పంపారు. రాజధానికి బయల్దేరిన నాగలింగం మిట్టమధ్యాహ్నమయ్యేసరికి అడవికి చేరుకున్నాడు. మర్రి చెట్టుకింద కూర్చుని తల్లి చేసిచ్చిన జొన్నరొట్టెలు తిన్నాడు. పక్కనే ఉన్న బావిలో నీళ్లు తాగి, కొద్దిసేపు చెట్టునీడన పడుకున్నాడు.

ఏదో చప్పుడవడంతో దిగ్గున లేచాడు. ఎదురుగా కత్తులు పట్టుకుని ఇద్దరు దొంగలు కనిపించారు. వారి ముఖం కనిపించకుండా ముసుగు ధరించారు. కేవలం వారి కళ్లు మాత్రమే కనిపిస్తున్నాయి.

"నీ దగ్గరున్న డబ్బంతా ఇచ్చెయ్" అని మెడమీద కత్తి పెట్టి బెదిరించారు దొంగలు.

నాగలింగం భయంతో 'బ్బె... బ్బె...బ్బె...' అనరిచాడు.

"నోరు ముయ్యి" అని గద్దించి, నాగలింగం దగ్గరున్న డబ్బంతా లాక్కున్నారు.

తిండికి కనీసం రెండు వరహాలైనా ఉంచమని సైగ చేశాడు నాగలింగం.

"ఒరే. వీడు మూగోడురా. అందుకే ఏం మాట్లాడలేకపోతున్నాడు. మనల్ని చూసినా ప్రమాదం లేదు. ఎవరికీ నోరు విప్పి చెప్పలేడు" అన్నాడు దొంగల్లో ఒకడైన అక్రం.

"నిజమేరా చక్రం" అని ముఖమ్మీది ముసుగు తొలగించారు ఇద్దరూ. నాగలింగం జేబులు, సంచి వెదికి ఉన్నదంతా దోచుకుని వదిలేశారు.

తన కళాకారుని బుద్ధితో వారి ముఖాల్ని పరీక్షగా చూశాడు నాగలింగం. నగరం చేరిన తర్వాత కనబడ్డవారికల్లా తన ఆవేదన చెప్పుకున్నాడు.

"మాతో చెప్పి ఏం ప్రయోజనం? రాజుతో చెప్పుకో! న్యాయం జరుగుద్ది" అన్నారు జనం.

మహారాజు దర్శనం చేసుకుని, తనను దొంగలు దోచుకున్న విషయం సైగలతో వివరించి కన్నీరు పెట్టాడు నాగలింగం . ఏదైనా ఉద్యోగం కూడా ఇప్పించమని వేడుకున్నాడు.

"దొంగల చిత్రాలు గీయగలవా?" అన్నాడు రాజు.

తలవూపి దొంగల ముఖాలు చక్కగా గీశాడు. అవే చిత్రాలు మరికొన్ని గీయమన్నాడు రాజు.

చాలా నేర్పుగా, వేగంగా చిత్రాలు గీశాడు నాగలింగం. వాటన్నింటినీ రాజ్యం నాలుగువైపులా, నగర ముఖ్యకూడళ్లలో పెట్టించాడు రాజు.

'ఈ దొంగలను పట్టిచ్చినా, ఆచూకీ చెప్పినా లక్ష వరహాల బహుమతి ఇస్తానని కూడా ప్రకటించాడు.

అక్రాన్ని, చక్రాన్ని జాతరలో చూసినట్లు ఓ రైతు వచ్చి చెప్పాడు. రాజాజ్ఞపై మారువేషాల్లో వెళ్లిన గూఢచారులు దొంగలిద్దర్నీ బంధించి తీసుకొచ్చారు. అనేక దోపిడీలు, దొంగతనాలు చేసినందుకు వారిరువురికీ కఠిన కారాగారశిక్ష విధించాడు రాజు.

"మూగోడు నోరు విప్పి చెప్పలేడని ముఖం చూపించాం. కానీ వీడు చిత్రకారుడని తెలీలేదు. ఖర్మకొద్దీ పట్టుబడ్డాం. చిత్రకారులతో చాలా జాగ్రత్తగా ఉండాలి సుమా!" అనుకున్నారు దొంగలిద్దరూ.

దొంగల చిత్రాలు గీసి, వారిని పట్టుకునేందుకు తోడ్పడ్డ నాగలింగానికి లక్ష వరహాల బహుమతి ఇవ్వబోయాడు రాజు.

కానీ 'డబ్బు వద్దు, మీ కొలువులో చిన్న ఉద్యోగం ఇప్పించండి' అని సైగలతో రాజును వేడుకున్నాడు నాగలింగం. రాజు కూడా సంతోషించి అతడ్ని ఆస్థాన చిత్రకారుడిగా నియమించుకున్నాడు.

నాగలింగానికి నోరు లేకపోయినా దొంగలను పట్టించినందుకు, ప్రయోజకుడైనందుకు అతని తల్లిదండ్రులు ఎంతగానో సంతోషించారు.

- పుప్పాల కృష్ణమూర్తి

అందాల 'బూ'!

'బూ' ఈ మధ్య చాలా పాపులరైపోయింది. అబ్బో ఎంత మంది అభిమానులు! ఎన్ని అభినందనలు!! అయినా తనేమైనా రియాల్టీ టీవీ స్టారా? పోనీ నటా? పాప్ సింగరా? అవేవీ కాదు. ఒక పెంపుడు కుక్క మాత్రమే.

'ఓ కుక్కకు ఇంత ప్రచారమా' అనుకుంటున్నారా? తనకు ఫేస్‌బుక్‌లో అకౌంట్ కూడా వుంది. 2009లో అమెరికాలో దాని యజమాని సరదాగా 'బూ' ఫొటోతో ఫేస్ బుక్ అకౌంట్ తెరిచాడు. అంతే ఎంతమంది స్పందించారో! అందరిదీ ఒకటే మాట 'బూ ... చాలా బావుంది' అని. ఆఖరికి హాలీవుడ్ తారలు సైతం 'బూ'ని చూసి ముచ్చటపడిపోయారు. మొత్తంమీద దానికి 20 లక్షల మంది అభిమానులున్నారు. అన్నట్టు 'బూ' ఫొటోలతో ఒక పుస్తకం (బూ, ది లైఫ్ ఆఫ్ ది వరల్డ్స్ క్యూటెస్ట్ డాగ్) కూడా తీసుకొచ్చారు. ధర కేవలం 8.99 పౌండ్లు మాత్రమే. ఆ పుస్తకాల ప్రమోషన్‌లో బూ పాత్ర చాలా వుందట! ఏమైనా బూ.. బహు టక్కరి సుమా.